'సర్'పై అన్నాడీఎంకే నిఘా!

82మంది సీనియర్ నేతల నియామకం

చెన్నై, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 4న ప్రారంభమైన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పనులపై నిఘా వేయడానికి ప్రధాన ప్రతిపక్షమైన అన్నాడీఎంకే 82మంది సీనియర్ నేతలను నియమించింది. ఈ మేరకు ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి ప్రకటన జారీ చేశారు. పార్టీ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు, మాజీ శాసనసభ్యులు ఈ నిఘా కమిటీలో సభ్యులుగా ఉన్నారు. రాష్ట్రంలోని 234 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతి మూడు నియోజకవర్గాలకు ఒకరు చొప్పున ఈ కమిటీ సభ్యులు ఆయా నియోజకవర్గాలలో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ పనులను స్వయంగా పరిశీలిస్తారు. ఈ పనులలో ఏవైనా తప్పిదాలు చోటుచేసుకుంటే వెంటనే పార్టీ అధిష్టానానికి, జిల్లా శాఖ కార్యదర్శులకు తక్షణమే ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని కూడా ఈపీఎస్ ఆదేశించారు. ప్రస్తుతం ఈ కమిటీ సభ్యులు ప్రతివార్డులోనూ మృతి చెందిన ఓటర్ల వివరాలను సేకరించి, వారి పేర్లను జాబితా నుండి తొలగించే పనులలో తలమునకలయ్యారు. ఇదే విధంగా రెండు అసెంబ్లీ నియోజకవర్గాలలో ఓటరు గుర్తింపు కార్డు కలిగిన ఓటర్లను కూడా గుర్తించే పనుల్లో ఉన్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ముసాయిదా ఓటర్ల జాబితా నకళ్లను చేతపట్టుకుని ఈ కమిటీ సభ్యులు వీధుల్లో తిరుగుతూ పార్టీ కార్యకర్తల సాయంతో మృతి చెందిన ఓటర్ల వివరాలను సేకరిస్తున్నారు. నాగపట్టినం జిల్లాలోని ఈ నిఘా కమిటీ సభ్యుడు, మాజీ శాసనసభ్యుడు న్యాయవాది బాబు ఈ విషయమై మాట్లాడుతూ తాను నివసిస్తున్న ప్రాంతంలోనే మృతి చెందిన 1680 మంది ఓటర్లను గుర్తించానని, ఆ వివరాలను ఎన్నికల సంఘం అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి తొలగించనున్నామని చెప్పారు. ఇదే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ పనులపై ఆయా నాయకులు తీవ్ర నిఘా వేస్తున్నారని ఈపీఎస్ పేర్కొన్నారు.


పెరంబూరులో ఓటర్లకు దరఖాస్తులను పంపిణీ చేస్తున్న ఈసీ సిబ్బంది

పెరిగిన విద్యుత్ వినియోగం

పెరంబూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు ప్రారంభమైనా, ఎండతీవ్రత అధికంకావడంతో, రోజువారీ విద్యుత్ వినియోగం 18,000 మెగావాట్లకు చేరింది. రాష్ట్ర రోజువారీ విద్యుత్ వినియోగం సరాసరిన 17,000 మెగావాట్లు కాగా, వేసవిలో 18,000 నుంచి 19,000 మెగావాట్ల వరకు నమోదవుతుంది. 2024 నుంచి వేసవిలో విద్యుత్ వినియోగం 20,000 మెగావాట్లు దాటింది. రాష్ట్రంలో ఈశాన్య రుతుపవనాలు అక్టోబరు చివరి వారంలో ప్రవేశించడంతో వర్షాలు కురిసి విద్యుత్ వినియోగం తగ్గుతోంది. ఆ ప్రకారం, 2024 నవంబరు 1వ తేది విద్యుత్ వినియోగం 12,500 మెగావాట్లు, 2వ తేది 13,530, 3వ తేది 12,160, 4వ తేది 15,465 మెగావాట్లుగా నమోదైంది. ఈ ఏడాది అక్టోబరు చివరి వారంలో ఈశాన్య రుతుపవనాలు ప్రవేశించినా, ఆశించిన వర్షాలు కురవడం లేదు. ఈ కారణంగా, ఈ నెల 1వ తేది విద్యుత్ వినియోగం 17,380 మెగావాట్లు, 2న 15,470, 3న 17,000, 4వ తేది 18,000 మెగావాట్లుగా నమోదైందని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.


నుంగంబాక్కం వళ్లువర్‌కోట్టమ్‌లో డీఎంకే 'మేథో ఉత్సవం'లో పుస్తకావిష్కరణ చేస్తున్న ఆ పార్టీ అధ్యక్షుడు ఎంకే స్టాలిన్

అడ్డదారుల్లో డీఎంకే ఓటమికి బీజేపీ యత్నం

స్టాలిన్ ధ్వజం

చెన్నై, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సిద్ధాంతపరంగా డీఎంకేతో తలపడడం సాధ్యం కాదని, ఎన్నికల సంఘం ద్వారా అడ్డదారుల్లో ఓడించేందుకు కేంద్రంలోని బీజేపీ పాలకులు తీవ్ర ప్రయత్నాలు సాగిస్తున్నారని, ఆ కుటిల ప్రయత్నాలలో భాగమే ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) అని డీఎంకే అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ అన్నారు. స్థానిక నుంగంబాక్కంలోని వళ్లువర్‌కోట్టమ్ హాలులో శనివారం ఉదయం డీఎంకే పతాకం రూపకల్పన జరిగిన 75 యేళ్లు పూర్తయిన సందర్భంగా ఆ పార్టీ యువజన విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటైన వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఆ సందర్భంగా 'కాలత్తిన్ నిరం కరుప్పు శివప్పు- డీఎంకే 75' అనే గ్రంథాన్ని ఆవిష్కరించి తొలి ప్రతిని పార్టీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ మంత్రి దురైమురుగన్‌కు అందించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో స్టాలిన్ ప్రసంగిస్తూ... పార్టీ 75 యేళ్ల సుదీర్ఘ ప్రయాణాన్ని గుర్తుంచుకునేలా యువజన విభాగం నేత, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి ఈ వేడుకలకు 'మేధో ఉత్సవం' అని పేరుపెట్టడం అన్ని విధాలా సమంజసంగా ఉందన్నారు. ఈ ఉత్సవాలను ఏటా పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

రాజకీయ పార్టీలు... పుట్టగొడుగులు

ప్రస్తుతం రాష్ట్రంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న రాజకీయ పార్టీల్లాగా ఏదో పార్టీని ప్రారంభించిన కొద్ది క్షణాలకే కాబోయే ముఖ్యమంత్రి తానేనని గొర్వంగా ప్రకటించుకునేలా డీఎంకే ఆవిర్భవం జరుగలేదన్నారు. సాధారణ పౌరులు కొందరు 1967నుంచి ప్రాంతీయ పార్టీగా గట్టి పునాదులు వేసుకున్న తర్వాతే అధికారంలోకి వచ్చిందన్నారు. మాయామాటలతో ప్రజానీకాన్ని మోసగించి అధికారంలోకి రాలేదన్నారు. పార్టీని ప్రారంభించిన 18యేళ్ల పాటు ప్రాణాలకు తెగించి మరీ కార్యకర్తలు ఇంటింటా డీఎంకే సిద్ధాంతాలను జనబాహుళ్యంలోకి తీసుకెళ్లారన్నారు. శ్రేణుల్లో సగం మంది నిరక్షరాస్యులుగా ఉన్నా పార్టీ సిద్ధాంతాలపై చక్కటి అవగాహన కలిగి ఉండేవారన్నారు. సైకిల్‌షాపు, టీషాపు, సెలూన్లు అంటూ ప్రతిచోటా డీఎంకే పత్రికలు, కరపత్రాలను ఉంచి ప్రచారం చేశారని అన్నారు. డీఎంకే చరిత్ర గురించి ఏమాత్రం తెలియనివారంతా నేడు పార్టీని నాశనం చేస్తామని బెదరింపు ధోరణులతోనే విమర్శలు చేస్తున్నారని, కొంతమంది అపరమేధావులు డీఎంకేలాగే తాముకూడాఅధికారంలో వచ్చేస్తామని పగటి కలలు కంటున్నారని అన్నారు. డీఎంకేలా గెలవాలంటే కఠోరశ్రమ అవసరమని, ఇవేవీ లేకుండా పార్టీని ప్రారంభించిన కొద్ది నెలలకే ఎవరూ అధికారంలోకి రాలేరన్నారు. విశ్వంలో ఒకే చంద్రుడు, ఒకే సూర్యుడు అన్నట్లు రాష్ట్రంలో డీఎంకే మాత్రమే సుస్థిరంగా ప్రజలకు సేవలను అందించగలుగుతుందని చెప్పారు. ఇక దేశంలో డీఎంకే లాంటి సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన పార్టీలు పుట్టబోవని స్టాలిన్ అన్నారు. ఈసభలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి,మంత్రులు ఐ.పెరియసామి, కే.ఎన్.నెహ్రూ, సామినాథన్, ఎంపీలు రాజా, తిరుచ్చి శివా, అంధియూరు సెల్వరాజ్, ఎండీఎంకే అధినేత వైగో, టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, సీపీఐ నేత ముత్తరసన్, డీఎంకే మిత్రపక్షాల నాయకులు తమీమున్ హన్సారీ, వేల్‌మురుగన్, ఏఆర్ ఈశ్వరన్, అబ్దుల్ సమద్, నవాజ్‌గనీ, సీనియర్ పాత్రికేయులు ఎన్.రామ్, నక్కీరన్ గోపాల్ పాల్గొన్నారు.

'సర్'పై అప్రమత్తంగా వ్యవహరించండి

డీఎంకే యువజన విభాగం కార్యకర్తలంతా ప్రస్తుతం రాష్ట్రంలో ఓటరు ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పేరుతో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ పనులపై నిఘా వేయాలని స్టాలిన్ పిలుపునిచ్చారు. రాష్ట్రంలో డీఎంకే సిద్ధాంతపరంగా ఓడించలేమని కేంద్రంలోని బీజేపీ పాలకులు ఎన్నికల సంఘాన్ని పనిముట్టుగా చేసుకుని ఓట్ల చోరీ జరిపి అడ్డదారిఅధికారంలోకి రావాలని తీవ్ర ప్రయత్నాలు సాగిస్తోందన్నారు. 'సర్'ని డీఎంకే చట్టపరంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. దేశంలో ప్రజాస్వామ్యాన్ని, రాష్ట్ర భవిష్యత్తును కాపాడే దిశగా 2026 శాసనసభ ఎన్నికల్లో అధికారంలోకి వస్తామని ఆయన కార్యకర్తల హర్షధ్వానాల నడుమ ప్రకటించారు.



తిరుచెందూర్‌లో భారీ వర్షం

● శివాలయంలో చేరిన నీరు

ప్యారీస్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి జిల్లాలోని కోస్తా ప్రాంతాలైన తిరుచెందూర్, కాయల్‌పట్టి, కుళశేఖరపట్టినం, ఉడన్‌కుళి తదితర ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షంతో ప్రసిద్ధి చెందిన తిరుచెందూర్ సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలోకి నీరు భారీగా చేరింది. దీంతో శనివారం రోజువారీ పూజలు నిర్వహించేందుకు శివాచార్యులు ఇబ్బంది పడ్డారు. వాతావరణంలో మార్పుల కారణంగా రాష్ట్రంలోని నాలుగు కోస్తా జిల్లాల్లో రానున్న 48 గంటలు వర్షాలు కురుస్తాయని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం తెలిపింది. ఈ నేపథ్యంలో, తిరుచెందూర్, ఆర్ముగనేరి, ఆత్తూరు, కాయల్‌పట్నం తదితర ప్రాంతాల్లో శుక్రవారం రాత్రి 10 గంటల నుంచి శనివారం తెల్లవారుజాము వరకు కురిసిన భారీవర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. తిరుచెందూర్ సుబ్రమణ్యస్వామి ఆలయ ప్రాంగణంలోని శివాలయంలోకి నీరు చేరడంతో పూజారులు, భక్తులు అసౌకర్యానికి గురయ్యారు. శనివారం ఉదయం కూడా తిరుచెందూర్, పరిసర ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసింది. ఆలయంలో చేరిన నీటి తొలగించే పనులను సిబ్బంది చేపట్టింది.

తిరుచెందూర్ బీచ్‌లో రాత్రి బస నిషేధం

అడయార్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరుచెందూర్ మురుగన్ ఆలయానికి వచ్చే భక్తులు రాత్రి వేళ బీచ్‌లో బస చేయడంపై అనుమతి లేదని ఆలయ నిర్వాహకులు తెలిపారు. రాష్ట్రంలో ప్రసిద్ధిచెందిన మురుగన్ ఆలయాల్లో తిరుచెందూర్ ఒకటి. ఈ ఆలయానికి స్థానికులతో పాటు పొరుగు జిల్లాలు, రాష్ట్రాలు, విదేశాలకు చెందిన భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారు. భక్తులు ఆలయం వెనుక ఉన్న సముద్రతీరంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకుంటారు. ఈ నేపథ్యంలో, ఇటీవల ఓ జ్యోతిషుడు సామాజిక మాధ్యమాల్లో తెలిపిన వార్త వైరల్‌గా మారింది. పౌర్ణమి రోజు రాత్రి తిరుచెందూర్ బీచ్‌లో బస చేసి, మురుసటిరోజు వేకువజామున పుణ్యస్నానం ఆచరించి స్వామిని దర్శించుకుంటే జీవితంలో మంచి ఫలాలు లభిస్తాయన్నారు. దీంతో పౌర్ణమి తిరుచెందూర్ బీచ్ భక్తులతో నిండిపోతోంది. అదే సమయంలో, అక్కడ బస చేసున్న భక్తుల సామాన్లు, ఆభరణాలు, నగదు చోరీ చేస్తున్న ఘటనలు అధికమయ్యాయి. ఈ విషయమై స్పందించిన ఆలయ నిర్వాహకులు, తిరుచెందూర్ బీచ్‌లో రాత్రి 10 నుంచి తెల్లవారుజామున 4 గంటల వరకు భక్తులు బస చేసేందుకు అనుమతించమని ప్రకటించారు. ఆ ప్రకారం, బీచ్‌లో ఉన్న భక్తులను ఆలయ భద్రతా సిబ్బంది, పోలీసులు, తీరప్రాంత భద్రతా విభాగం పోలీసులు పంపించివేశారు.


తిరుచెందూర్ బీచ్‌లో రాత్రి వేళ బస చేస్తున్న భక్తులు (ఫైల్ ఫొటో)

మరుదమలై వద్ద 184 అడుగుల మురుగన్ విగ్రహ పనులపై స్టే


మరుదమలై మురుగన్ ఆలయం

చెన్నై, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరు సమీపం మరుదమలై మురుగన్ ఆలయం వద్ద 184 అడుగుల మురుగన్ విగ్రహ నిర్మాణ పనులను నిలుపుదల చేస్తూ మద్రాసు హైకోర్టు ధర్మాసనం స్టే విధించింది. అటవీ ప్రాంతానికి 137 మీటర్ల దూరంలో ఈ విగ్రహం ఏర్పాటు చేయడం వల్ల అటు వన్యప్రాణులకు, ఇటు భక్తులకు తీవ్ర ఇబ్బందులు కలిగే అవకాశాలు ఉన్నాయని న్యాయమూర్తులు జస్టిస్ ఎన్.సతీష్‌కుమార్, డి. భరత్‌చక్రవర్తితో కూడిన ధర్మాసనం పేర్కొంది. సింగపూర్‌లో ఇలాంటి ఎత్తైన మురుగన్ విగ్రహం ప్రతిష్ఠించినా ఆదేశంలో కఠిన నిబంధనలు అమలులో ఉన్నాయన్నారు. మరుదమలైమురుగన్ ఆలయంవద్ద అలాంటి కఠిన నిబంధనలను పాటించే ఆస్కారముండదని, ఈకారణాలను దృష్టిలో ఉంచుకునే విగ్రహం నిర్మాణ పనులపై స్టే విధిస్తున్నట్లు పేర్కొన్నారు.

విజయ్ పార్టీతో దినకరన్ మంతనాలు



ప్యారీస్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్‌తో పొత్తు కుదుర్చుకోవడంపై అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే) ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ మంతనాలు సాగిస్తున్నట్లు తెలిసింది. కరూర్ తొక్కిసలాటలో 41 మంది మృతిచెందిన అనంతరం సుమారు నెల రోజులపాటు రాజకీయాల గురించి ప్రస్తావించని విజయ్ మళ్లీ చురుగ్గా వ్యవహరిస్తున్నారు. టీవీకేతో పొత్తు కుదుర్చుకునేందుకు ప్రాంతీయ పార్టీలు ఉత్సాహం చూపుతూ రాయబారాలు కూడా నడుపుతున్నాయి. అయితే 2026 అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే ఎవరితో పొత్తు అన్న నిర్ణయాన్ని విజయ్ బహిరంగ పరచలేదు. అయినప్పటికీ విజయ్‌తో చేతులు కలిపితే విజయం తథ్యమన్న నమ్మకంతో టీటీవీ దినకరన్ పొత్తుకు సంబంధించిన చర్చల్లో పాల్గొంటున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇటీవల టీవీకేకు చెందిన కొంతమంది నేతలు దినకరన్ నివాసానికి వెళ్లి పొత్తు గురించి చర్చించినట్టు తెలిసింది. మరోవైపు విజయ్, దినకరన్ ఫోన్‌లో సంప్రదించుకుని త్వరలో పొత్తుపై నిర్ణయం వెల్లడించనున్నట్లు ఆ రెండు పార్టీల నిర్వాహకులు తెలిపారు. టీటీవీ దినకరన్ లాగే అన్నాడీఎంకే బహిష్కృత నేత, మాజీ ముఖ్యమంత్రి ఒ.పన్నీర్‌సెల్వంకూడా విజయ్‌తో చేతులు కలిపేందుకు నిర్ణయించారని, అయితే ఆయన సన్నిహితులు ఎమ్మెల్యే వైద్యలింగం, అయ్యప్పన్ డీఎంకే కూటమిలో చేరాలని ఓపీఎస్‌ను ఒత్తిడి చేస్తున్నట్లు సమాచారం.

నిత్య భగవన్నామ స్మరణతో సకల సౌభాగ్యాలు

● త్రిదండి చిన్న జీయర్‌స్వామి



ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహిస్తున్న త్రిదండి చిన్న జీయర్‌స్వామి

ప్యారీస్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నిత్య భగవన్నామ స్మరణతో సకల సౌభాగ్యాలు ప్రాప్తిస్తాయని త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి పేర్కొన్నారు. స్థానిక పెరంబూరులోని ఎస్పీఆర్ సిటీలో సమతా ఇష్టి సేవా కమిటీ, జీయర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్ (జెట్) చెన్నై సంయుక్త ఆధ్వర్యంలో సమత్వ, శాంతి, సౌఖ్యాభివృద్ధి కోసం మహాయజ్ఞంగా ప్రారంభమైన స్వాప్తాహ్నిక పంచకుండాత్మక 'సమతా ఇష్టి' మూడోరోజు కార్యక్రమం శనివారం చిన్న జీయర్‌స్వామి అధ్యక్షతన అత్యంత వైభవంగా జరిగింది. ఉదయం 8 గంటలకు తీర్థగోష్ఠి, శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారు, భగవత్ రామానుజులుకు తిరుమంజనం, 10.35 గంటలకు వేంకటేశ్వరపూజ, మధ్యాహ్నం 12 గంటలకు ఉదయపూర్ణాహుతి తదితర పూజలను వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తిరుమంజనంలో 545 గ్రామాలకు చెందిన ప్రజలు పవిత్ర జలం నింపిన కలశాలతో పాల్గొని గోవిందనామస్మరణతో హోరెత్తించారు. వేంకటేశ్వర స్వామికి ప్రీతికరమైన శనివారం స్వామి పర్యవేక్షణలో నిర్వహించిన సామూహిక పూజలో 150 జంటలకు పైగా పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులనుద్దేశించి చిన్నజీయర్‌స్వామి ప్రసంగిస్తూ... పుత్రభాగ్యం భగవంతుడి కృపేనని అన్నారు. సంతాన ప్రాప్తి కలుగుతుందన్న నమ్మకంతో 30 జంటలు శ్రీ వైనతేయ ఇష్టిలో పాల్గొన్నారని, వీరితో పాటు మిగతా భక్తులందరూ కూడా లోకసంక్షేమాన్ని కాంక్షిస్తూ నిత్య పూజల్లో పాల్గొనాలని సూచించారు. ఈ నెల 13వ తేదీన మహా పూర్ణాహుతి అనంతరం శ్రీనివాస కల్యాణోత్సవాన్ని కోలాహలంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కాగా, సాయంత్రం 5 గంటలకు విష్ణుసహస్రనామ పారాయణంలో మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. 5.30 గంటలకు నగరంలోని కళాక్షేత్ర కళాకారులు రామానుజులు జీవిత చరిత్రపై ప్రదర్శించిన నృత్యప్రదర్శన అలరించింది. 6.30 గంటలకు స్వామి ప్రసంగం, రాత్రి 8.30 గంటలకు సాయంకాల పూర్ణాహుతి అనంతరం భక్తులందరికీ అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.


పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

మూడు దశాబ్దాల కళామతల్లి సేవ

ఆధునిక నాటక రంగంలో బహుముఖ ప్రజ్ఞాశాలి మురుగభూపతి



7

వేళచ్చేరి-సెయింట్ థామస్ మౌంట్ మధ్య గూడ్స్ రైలుతో ట్రయల్ రన్



పెరంబూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): స్థానిక వేళచ్చేరి - సెయింట్ థామస్ మౌంట్ మధ్య ఫ్లై ఓవర్‌పై రైలు మార్గం పనులు పూర్తైన నేపథ్యంలో, తొలిసారిగా గూడ్సు రైలు ట్రయల్ రన్ నిర్వహించారు. చెన్నై బీచ్ - వేళచ్చేరి మధ్య ప్రతిరోజు 100 ఎమ్మార్టీఎస్ రైలు సర్వీసులు నడుపుతున్నారు. వేళచ్చేరి నుంచి సెయింట్ థామస్ మౌంట్ వరకు 5 కి.మీ దూరం ఎమ్మార్టీఎస్ రైలు సేవలు విస్తరించాలని నిర్ణయించారు. 2008లో పనులు ప్రారంభించారు. కానీ, ఆదంబాక్కం, తిల్లైగంగా నగర్‌లలో భూసేకరణలో సమస్యలతో పనులు నిలిచిపోయాయి. 2022లో పనులు మళ్లీ ప్రారంభమయ్యాయి. 17ఏళ్ల సుదీర్ఘకాలం కొనసాగిన ఈపనులు ప్రస్తుతం పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో, వేళచ్చేరి నుంచి సెయింట్ థామస్ మౌంట్ వరకు 10 పెట్టెలతో గూడ్స్ రైలు ట్రయల్ రన్ నిర్వహించారు. రైలు మార్గం నాణ్యత, వంపులు తిరిగే సమయంలో ప్రకంపనలు తదితరాలను ఆధునిక పరికరాలు ఉపయోగించి పరిశీలించారు. ప్రస్తుతం రెండు ప్రాంతాల్లో పరిశీలన చేపట్టగా, మరో ఏడు ప్రాంతాల్లో పనులు పూర్తిచేసి, నివేదికను రైల్వే శాఖకు సమర్పించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు.

సమాచార దృష్టి

రేపటి నుంచి ఎగ్మూర్ బదులు తాంబరం నుంచి ఎక్స్‌ప్రెస్ రైళ్లు

పెరంబూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎగ్మూర్ రైల్వేస్టేషన్‌లో చేపడుతున్న పునరుద్ధరణ పనుల కారణంగా పలు రైళ్లు ఎగ్మూర్‌కు బదులు తాంబరం నుంచి బయల్దేరనున్నట్టు దక్షిణ రైల్వే ప్రకటించింది.

● నెం.16866 తంజావూరు- ఎగ్మూర్ ఉళవన్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 10 నుంచి 29వ తేది వరకు ఎగ్మూర్‌కు బదులు తాంబరం వరకు మాత్రమే నడపనున్నారు. మరోమార్గంలో, నెం.16865 చెన్నై-తంజావూరు ఉళవన్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 11 నుంచి 30వ తేది వరకు ఎగ్మూర్ బదులు తాంబరం నుంచి రాత్రి 11 గంటలకు బయల్దేరుతుంది.

● నెం.20636 కొల్లం- ఎగ్మూర్ అనంతపురి సూపర్‌ఫాస్ట్ ఈ నెల 10 నుంచి 29వ తేది వరకు ఎగ్మూర్‌కు బదులు తాంబరం వరకు మాత్రమే నడపనున్నారు. మరోమార్గంలో, నెం.20635 ఎగ్మూర్-కొల్లం అనంతపురం సూపర్‌ఫాస్ట్ రైలు ఈ నెల 11 నుంచి 30వ తేది వరకు ఎగ్మూర్‌కు బదులు తాంబరం నుంచి సాయంత్రం 6.20 గంటలకు బయల్దేరుతుంది.

● నెం.22662 రామేశ్వరం - ఎగ్మూర్ సేతు సూపర్‌ఫాస్ట్ ఈ నెల 10 నుంచి 29వ తేది వరకు ఎగ్మూర్‌కు బదులు తాంబరం వరకు మాత్రమే నడుపనున్నారు. నెం.22661 ఎగ్మూర్-రామేశ్వరం సేతు సూపర్‌ఫాస్ట్ రైలు ఈ నెల 11 నుంచి 30వ తేది వరకు ఎగ్మూర్ బదులు తాంబరం నుంచి సాయంత్రం 6.20 గంటలకు బయల్దేరుతుంది.

● నెం.16752 రామేశ్వరం - ఎగ్మూర్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 10 నుంచి 29వ తేది వరకు చెన్నైకు బదులు తాంబరం వరకు మాత్రమే నడపనున్నారు. మరోమార్గంలో, నెం.16751 చెన్నై ఎగ్మూర్-రామేశ్వరం ఎక్స్‌ప్రెస్ రైలు ఈ నెల 11 నుంచి 30వ తేది వరకు ఎగ్మూర్‌కు బదులు తాంబరం నుంచి రాత్రి 7.42 గంటలకు బయల్దేరుతుంది.

బీచ్ నుంచి ముంబై ఎక్స్‌ప్రెస్...

● నెం.22158 ఎగ్మూర్ - ముంబై సీఎస్ఎంటీ సూపర్‌ఫాస్ట్ రైలు ఈ నెల 11 నుంచి 30వ తేది వరకు ఎగ్మూర్‌కు బదులు చెన్నై బీచ్ నుంచి ఉదయం 6.45 గంటలకు బయల్దేరుతుంది.

● నెం.16127/16128 ఎగ్మూర్-గురువాయూర్-ఎగ్మూర్ ఎక్స్‌ప్రెస్ రైలు తదుపరి ప్రకటన వెలువడే వరకు తాంబరం నుంచి బయల్దేరుతుంది.

జనవరి నుంచి రెండో ఏసీ సబర్బన్ రైలు సేవలు

పెరంబూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): నగరంలో రెండవ ఏసీ సబర్బన్ రైలు సేవలు జనవరి నుంచి అందుబాటులోకి రానున్నాయి. మూర్ మార్కెట్ కాంప్లెక్స్ - తిరువళ్లూర్ - తిరుత్తణి, మూర్ మార్కెట్ కాంప్లెక్స్ - గుమ్మిడిపూండి - సూళ్లూరుపేట, చెన్నై బీచ్ - తాంబరం - చెంగల్పట్టు మధ్య రోజూ 450కి పైగా సబర్బన్ రైలు సర్వీసులు అందుబాటులో ఉన్నాయి. దూరప్రాంతాలకు ఏసీతో కూడిన సబర్బన్ రైళ్లు నడపాలని ప్రయాణికులు రైల్వే శాఖను కోరారు. ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు, గత ఏప్రిల్ నెలలో చెన్నై బీచ్-తాంబరం-చెంగల్పట్టు మధ్య మొదటి ఏసీ సబర్బన్ రైలు సేవలు ప్రారంభమయ్యాయి. తొలుత 8 సర్వీసులు మాత్రమే నడుపుతుండగా, ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు సమయం మార్చి నడుపుతున్నారు. ప్రస్తుతం ఏసీ సబర్బన్ రైలులో ప్రతిరోజు సుమారు 2,500 మంది ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో, రెండవ ఏసీ సబర్బన్ రైలు సేవలు అక్టోబరు నుంచి అందుబాటులోకి వస్తాయని దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు. కానీ, ఐసీఎఫ్‌లో రైలు తయారీ పనుల్లో జాప్యం చోటుచేసుకుంది. ఈ పనులు ముగిసి డిసెంబరు నెలాఖరులో ఏసీ సబర్బన్ రైలును దక్షిణ రైల్వేకు అప్పగించే అవకాశముండగా, జనవరి నుంచి ఈ రైలు నడపనున్నారు. మూర్ మార్కెట్ కాంప్లెక్స్-తిరుత్తణి మధ్య రెండవ ఏసీ సబర్బర్ రైలు నడిపే అంశం పరిశీలనలో ఉందని అధికారులు తెలిపారు.

కాట్పాడి మీదుగా మచిలీపట్నంకు ప్రత్యేక రైలు

ప్యారీస్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్రం కొల్లం నుంచి బయలుదేరే వారాంతపు ప్రత్యేక రైలు (నెం.07103/07104) రాష్ట్రంలోని కాట్పాడి, జోలార్‌పేట, సేలం మీదుగా ఆంధ్రరాష్ట్రం మచిలీపట్నం చేరుకుంటుందని దక్షిణరైల్వేశాఖ ప్రకటించింది. శుక్రవారాల్లో (డిసెంబరు 5, 12, 19, జనవరి 9, 16వ తేదీల్లో) ఉదయం 11గంటలకు మచిలీపట్నం నుంచి బయలుదేరే రైలు తెల్లవారుజామున 3.25 గంటలకు రేణిగుంటకు చేరుకుంటుంది. అదే రోజు ఆ రైలు రాత్రి 10 గంటలకు కాట్పాడి, జోలార్‌పేట మీదుగా కొల్లం చేరుకుంటుంది. మరోమార్గంలో కొల్లం నుంచి ఆదివారాల్లో (డిసెంబరు 7, 14, 21, జనవరి 11, 18వ తేదీ) మధ్యాహ్నం 12.30 గంటలకు బయలుదేరి రాత్రి 9.55 గంటలకు రేణిగుంటకు చేరుకుంటుంది. అక్కడినుంచి బయలుదేరి 10.36కు కోడూరు, 11.08 గంటలకు రాజంపేట, 11.53 గంటలకు కడపకు చేరుకుంటుందని రైల్వేశాఖ తెలిపింది.

నేడు సెకండరీ గ్రేడ్ కానిస్టేబుల్ భర్తీ రాత పరీక్ష

● 3,665 పోస్టులకు 2.25 లక్షల మంది పోటీ

అడయార్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పోలీసు శాఖలో 3,655 సెకండరీ గ్రేడ్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి ఆదివారం రాత పరీక్ష జరగనుంది. రాతపరీక్షకు రాష్ట్రవ్యాప్తంగా 45 కేంద్రాలు ఏర్పాటుచేయగా, 2.25 లక్షల మంది పరీక్ష రాయనున్నారు. రాష్ట్ర పోలీసు శాఖలో ఖాళీగా ఉన్న 2,833 సెకండరీ గ్రేడ్ కానిస్టేబుల్, జైళ్ల శాఖలో ఖాళీగా ఉన్న 180, అగ్నిమాపక శాఖలో 631, 21 ఎస్టీ ఖాళీ పోస్టులు అని మొత్తం 3,665 పోస్టుల భర్తీకి తమిళనాడు యూనిఫాం ఉద్యోగుల ఎంపిక బోర్డు గత ఆగస్టు 21వ తేది నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్షకు 2.5 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. పరీక్ష కోసం రాష్ట్రవ్యాప్తంగా 45 కేంద్రాలు ఏర్పాటుచేశారు. అభ్యర్థులందరూ ఉదయం 8 నుంచి 9.30 గంటల్లోపు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. అనంతరం వచ్చే అభ్యర్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరు. సెల్‌ఫోన్, స్మార్ట్ వాచ్, కాలిక్యులేటర్, చేతి గడియారం తదితరాలను పరీక్షా కేంద్రంలోకి అనుమతించరు. ఈ పరీక్షలో అవినీతి అడ్డుకునేలా అభ్యర్థుల వేలిముద్ర నమోదుచేయనున్నారు. అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించే సమయంలోనే వారి ఎడమ చేతి బొటనవేలును స్కాన్ చేసి అప్‌లోడ్ చేశారు. పరీక్షా కేంద్రం వెలుపల వేలిముద్ర తర్వాతే అభ్యర్థులను అనుమతించనున్నారు.

ప్రధాని ప్రారంభించిన వందే భారత్ రైలుకు

ఘన స్వాగతం

● కోవై రైల్వేస్టేషన్‌లో సందడి



కోవై రైల్వేస్టేషన్‌లో వందే భారత్ రైలు

ప్యారీస్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వారణాసిలో ప్రధాని నరేంద్ర మోదీ శనివారం రైల్వేమంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొని నాలుగు వందే భారత్ రైళ్ల సేవలను పచ్చజెండా ఊపి ప్రారంభించారు. ఆ మేరకు కేరళ రాష్ట్రం ఎర్నాకుళం నుండి కర్ణాటక రాష్ట్రం బెంగళూరు వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రారంభించిన రైలు రాష్ట్రంలో కోవై, ఈరోడ్, తిరుప్పూర్ ప్రాంతాల్లో ఆగివెళుతుంది. కేరళ రాష్ట్రం ఎర్నాకుళం నుండి బయలుదేరి శుక్రవారం కోవై చేరుకున్న ఈ రైలుకు రైల్వే ఉద్యోగులు, ప్రయాణికులు ఘనంగా స్వాగతం పలికారు. ఎర్నాకుళం - బెంగళూరు మార్గంలో పరుగులు తీస్తున్న ఈ రైలు ప్రయాణికులకు వేగవంతమైన, సౌకర్యావంతమైన కనెక్టివిటీని అందిస్తుంది. ప్రయాణ సమయాన్ని 2 గంటలకు పైగా తగ్గించడంతో పాటు ప్రధాన ఐటీ, వాణిజ్య కేంద్రాలను అనుసంధానం చేయడంతో పాటు పర్యావరణాన్ని పెంపొందించడానికి సహాయపడుతుందని రైల్వే అధికారులు తెలిపారు. ఈ రైలు కర్ణాటకలోని కృష్ణరాజపురం, తమిళనాడులోని జోలార్‌పేట, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, కోవై, పాలక్కాడు, కేరళలోని త్రిసూర్‌లో ఆగివెళుతుంది. బుధవారం మినహాయించి వారానికి ఆరు రోజులు ఈ రైలు ప్రజలకు అందుబాటులో ఉంటుందని దక్షిణరైల్వేశాఖ తెలిపింది.

బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారం

● యువకుడికి 30 ఏళ్ల జైలు

అడయార్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడిన కేసులో, నిందితుడికి కోర్టు 30 ఏళ్ల జైలుశిక్ష విధించింది. దిండుగల్ జిల్లాకు చెందిన యువకుడు, గత ఏడాది 13 ఏళ్ల బాలికను కిడ్నాప్ చేసి అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ వ్యవహారంపై బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదుచేసి యువకుడిని అరెస్ట్ చేశారు. ఈ కేసు దిండుగల్ పోక్సో ప్రత్యేక కోర్టులో విచారణ ముగిసిన నేపథ్యంలో, న్యాయమూర్తి శుక్రవారం తీర్పు వెలువరించారు. నేరం నిరూపితం కావడంతో యువకుడికి పోక్సో చట్టం కింద 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.5 వేలు జరిమానా, బీఎన్ఎస్ చట్టం సెక్షన్-87 (కిడ్నాప్) ప్రకారం 10 ఏళ్ల జైలుశిక్ష, రూ.5 వేలు జరిమానా విధించారు. రెండు శిక్షలు ఏకకాలంలో అనుభవించాలని ఉత్తర్వులు జారీచేశారు. అలాగే, బాధిత చిన్నారికి రాష్ట్ర ప్రభుత్వం రూ.4 లక్షలు పరిహారం ఇవ్వాలని న్యాయమూర్తి సిఫారసు చేశారు.

పురుషులు నడిపే 'పింక్' ఆటోల స్వాధీనం

● చెన్నై జిల్లా కలెక్టర్ హెచ్చరిక

పెరంబూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): 'పింక్' ఆటోలను పురుషులు నడిపితే చర్యలు తీసుకుంటామని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ హెచ్చరించారు. స్త్రీలు, చిన్నారుల భద్రత కోసం మహిళలు పింక్ ఆటోలు నడిపే పథకాన్ని మార్చి 8వ తేది సీఎం స్టాలిన్ ప్రారంభించారన్నారు. ఈ పథకంలో పింక్ ఆటోలు పొందే మహిళలకు రూ.లక్ష సబ్సిడీ అందజేయనున్నారు. ఈ ఆటోలకు జీపీఎస్ పరికరం అమర్చడంతో మహిళలు, చిన్నారులు ఎలాంటి భయాందోళనలు లేకుండా ప్రయాణిస్తున్నారని తెలిపారు. కానీ, కొన్ని ప్రాంతాల్లో పింక్ ఆటోలు పురుషులు నడుపుతున్నట్లు ఫిర్యాదులుఅందాయన్నారు. రవాణా చట్ట నిబంధన ప్రకారం, పింక్ ఆటోలు పురుషులు నడపరాదన్నారు. ఈ విషయమై సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు తనిఖీలు చేపట్టగా, పలు ప్రాంతాల్లో పురుషులు పింక్ ఆటోలు నడుపుతున్నట్లు గుర్తించారన్నారు. అధికారులు ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేపట్టి, పింక్ ఆటోలు పురుషులు నడుపుతుంటే, మొదటి సారిగా అడ్డుకుని వారిని హెచ్చరిస్తారని, నిబంధన అతిక్రమించి మరోసారి పట్టుబడితే ఆటో స్వాధీనం చేసుకుంటామన్నారు.

ఇద్దరు మహిళల అరెస్ట్

పెరంబూర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి):స్థానిక కేకేనగర్‌లో వ్యభిచారం సాగి స్తున్న ఇద్దరు మహిళలను అరెస్ట్‌చేశారు. వ్యభిచార నిరోధక విభాగం పోలీసులకు అందిన సమాచారంతో, శుక్రవారం కేకే నగర్ 11వ సెక్టార్‌లో ఉన్న ఓఅపార్ట్‌మెంట్‌లోని ఇంట్లో తనిఖీలు చేపట్టారు. ఆసమయంలో, అక్కడ వ్యభిచారం జరుగుతున్నట్లు గుర్తించారు. విచారణలో... వ్యాసర్పాడికి చెందిన కార్తికదేవి (33), ఆర్‌ఏ పురానికి చెందిన సుగంధి (48) ఆ ఇంటిని అద్దెకు తీసుకుని వ్యభిచారం సాగిస్తున్నట్లు తెలిసింది. ఈఘటనపై కేసు నమోదుచేసినపోలీసులు, ఇరువురిని అరెస్ట్‌చేసి కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు. ఆ ఇంటి నుంచి ఇద్దరు మహిళలను రక్షించి ప్రభుత్వ హోంకు తరలించినట్లు నగర పోలీసు శాఖ శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

రోడ్డు ప్రమాదంలో బుల్లితెర నటుడి మృతి



పేరరసు (ఫైల్ ఫొటో)

అడయార్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బస్సు ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న ఘటనలో బుల్లితెర నటుడు మృతి చెందాడు. కడలూరు జిల్లా బన్రూటి సమీపం సీరంకుప్పానికి చెందిన పేరరసు (21) బుల్లితర అసిస్టెంట్ డైరక్టర్, నటుడు. ఆయన 'ఉప్పు పులి కారం' సీరియల్ ద్వారా ప్రసిద్ధిచెందాడు. ఆయన చెన్నైలో ఉంటుండగా, అనారోగ్యంతో ఉన్న తండ్రి చూసేందుకు స్వగామానికి వెళ్లాడు. శనివారం ఉదయం బన్రూటి సమీపం ఆండికుప్పం రోడ్డులో పేరరసు వస్తున్న బైక్‌ను వెనుక నుంచి ప్రభుత్వ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో పేరరసు ఘటనా స్థలంలోనే మృతిచెందాడు. సమాచారం అందుకున్న కాటంపులియూర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

వికటించిన ప్రేమ వివాహం

● ఒకటిన్నరేళ్లకే యువతి ఆత్మహత్య



రేష్మ (ఫైల్ ఫొటో)

అడయార్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వివాహం చేసుకున్న భార్యాభర్తల మధ్య విభేదాల కారణంగా యువతి ఆత్మహత్యకు పాల్పడింది. కన్నియాకుమారి జిల్లా నాగర్‌కోయిల్ కీళమరవన్ హౌసింగ్ బోర్డుకి చెందిన సెల్వరసన్(25) టెంపోడ్రైవర్. విరుదునగర్ జిల్లా రాజపాళయానికిచెందిన బంధువు రేష్మ (20)ను ఒకటిన్నరేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నాడు. కొద్దిరోజులుగా భార్యాభర్తల మధ్య విభేధాలుచోటుచేసుకుంటున్నాయి. ఘటన జరిగిన రోజున ఇరువురి మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం చోటుచేసుకోగా, సెల్వరసన్ ఆగ్రహంతో ఇంటినుంచి వెళ్లిపోయాడు. మనస్తాపం చెందిన రేష్మ, తన తల్లికి ఫోన్ చేసి, ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పి ఫోన్ కట్ చేసింది. దిగ్భ్రాంతి చెందిన తల్లి నాగర్‌కోయిల్‌లోని బంధువులకు ఫోన్ చేసి సమాచారం అందించింది. వారు అక్కడకు చేరుకుని తలుపు తట్టగా ఎంతసేపటికి తలుపు తీయకపోవడంతో, ధ్వంసం చేసి లోపలికి వెళ్లారు. ఉరేసుకున్న స్థితిలో రేష్మ కనిపించింది. సమాచారం అందుకున్న కొట్టార్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆచారిపల్లం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదుచేసి విచారిస్తున్నారు.

వీధి కుక్కల దాడిలో వృద్ధుడికి తీవ్రగాయాలు

తిరుత్తణి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వీధి కుక్కలదాడిలో ఓ వృద్ధుడికి తీవ్రగాయాలయ్యాయి. తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులోని చిత్తూరు జాతీయ రోడ్‌పై ఆ ప్రాంతానికి చెందిన చుక్కల యతిరాజులశెట్టి (68) వాకింగ్ చేస్తుండగా హఠాత్తుగా వీధికుక్కలు అతడిపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచాయి. గమనించిన స్థానికులు వాటిని తరిమి వృద్ధుడిని ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రజలు మాట్లాడుతూ, గత కొన్ని నెలలుగా ఆ ప్రాంతంలో వీధికుక్కల బెడద ఎక్కువైందని, దీనిపై పలుమార్లు అధికారులకు తెలిపినా ఫలితంలేదని వాపోయారు. ఇకనైనా అధికారులు స్పందించి సకాలంలో కుక్కల బెడద నుంచి తమను తప్పించాలని కోరుతున్నారు.

నేడు స్టాలిన్ అధ్యక్షతన డీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం

పెరంబూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): డీఎంకే జిల్లా కార్యదర్శుల సమావేశం ఆదివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరగనున్నట్టు పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ పేర్కొన్నారు. పార్టీ అధ్యక్షుడు, సీఎం స్టాలిన్ అధ్యక్షతన ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశంలో, జిల్లా కార్యదర్శులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జీలు తప్పకుండా పాల్గొనాలని తెలిపారు. సమావేశంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్)పై చర్చించనున్నట్లు దురైమురుగన్ తెలిపారు. కాగా, 'సర్'కు వ్యతిరేకంగా డీఎంకే, కూటమి పార్టీల ఆధ్వర్యంలో ఈనెల 11వ తేది అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు చేపట్టనున్నారు.

రోడ్లపై చెట్లను తొలగించండి

● అధికారులకు గ్రామస్తుల విజ్ఞప్తి



రోడ్డుపై మొలిచిన చెట్లు

తిరుత్తణి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు యూనియన్ పరిధిలోని వడకుప్పానికి వెళ్లే రోడ్డుమార్గంలో గత ఏడాది కాలంగా శుభ్రపరచకపోవడంతో ఆ ప్రాంతంలో చెట్లు పెరిగి వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వడకుప్పం నుంచి మునిస్వామినాయుడు కండ్రిగకు వెళ్లే రోడ్డుపై పిచ్చిచెట్లు పెరిగిపోయి రోడ్డా?.. ఖాళీ స్థలమా?.. అన్నట్లు మొక్కలు మొలిచి రోడ్డు కనుమరుగైంది. దీనిపై పలుమార్లు మున్సిపల్ అధికారులకు విన్నవించినా ఫలితంలేదని, అధికారులు సకాలంలో స్పందించి రోడ్డును శుభ్రపరిచి వాహనాలకు ఆటంకంలేకుండా చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

ఫోన్ చూడొద్దన్నారని తల్లిదండ్రుల మందలింపు

విద్యార్థిని ఆత్మహత్య

తిరుత్తణి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మొబైల్ ఫోన్ చూడొద్దని తల్లిదండ్రులు మందలించడంతో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. సంఘటన తిరువళ్లూరు జిల్లా ఊతుకోట సమీపంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తూర్పుగోదావరి జిల్లాకు చెందిన రగుత్తి మాణిక్యం, లక్ష్మి దంపతులు ఊత్తుకోట సమీపంలోని ఎర్రన్‌కుప్పంలో నివాసముంటున్నారు. వీరికి హేమంత్‌సాయి (20), అన్నపూర్ణ (17) పిల్లలున్నారు. ఈ నేపథ్యంలో, ఇంజనీరింగ్ చదువుతున్న అన్నపూర్ణ తరచూ మొబైల్‌ఫోన్ చూస్తోంది. దీంతో ఆమెను ఫోన్ చూడొద్దని మందలించారు. మనస్తాపానికి గురైన అన్నపూర్ణ మంగళవారం ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుంది. గమనించిన లక్ష్మి వెంటనే తిరువళ్లూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్సల కోసం చెన్నై కీల్పాక్ ఆస్పత్రికి తరలించగా, చికిత్సలు పొందుతూ శనివారం సాయంత్రం అన్నపూర్ణ మృతి చెందింది.

ప్రొఫెసర్ మందలించాడని ...

పెరంబూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి):మొబైల్‌ఫోన్‌తో పరీక్షా కేంద్రంలోకి వచ్చిన విద్యార్థిని ప్రొఫెసర్ మందలించడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానిక కోడంబాక్కం శివాలయం వీధికి చెందిన మురుగన్ కుమారుడు వాసుదేవన్(19) ఓ ప్రైవేటు కళాశాలలో బీసీఏ రెండో సంవత్సరం చదువుతున్నాడు. వాసుదేవన్ గురువారం కళాశాలలో జరిగిన సెమిస్టర్‌కు మొబైల్ ఫోన్‌తో పరీక్షా కేంద్రంలోకి వెళ్లాడు. అతనిని తనిఖీ చేసిన ప్రొఫెసర్, ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే, వాసుదేవన్‌ను ప్రత్యేక గదిలో కూర్చోబెట్టి తాళం వేసినట్లు సమాచారం. ఈ చర్యలతో తీవ్ర మనస్తాపం చెందిన వాసుదేవన్, శుక్రవారం సాయంత్రం తనఇంట్లో పడకగదిలో ఫ్యానుకు ఉరేసుకున్నాడు. సమాచారం అందుకున్న కోడంబాక్కం పోలీసులు, ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేకేనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. శనివారం ఉదయం కోడంబాక్కం పోలీస్ స్టేషన్ ముందు వాసుదేవన్ తల్లిదండ్రులు,బంధువులు,స్నేహితులు కళాశాలనిర్వాహకులపై చర్యలు చేపట్టాలని, అప్పటివరకు మృతదేహాన్ని తీసుకోమని తేల్చి చెబుతూ, పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు వారితో చర్చలు జరుపుతున్నారు.

కరూర్ దుర్ఘటన... అంబులెన్స్ డ్రైవర్లను విచారించిన సీబీఐ

పెరంబూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కరూర్‌లో సెప్టెంబర్ 27 రాత్రి టీవీకే అధినేత విజయ్ రోడ్‌షోలో తొక్కిసలాటలో 41 మంది ప్రాణాలు కోల్పోయిన ఘటనపై అంబులెన్స్ డ్రైవర్లను మూడోరోజూ సీబీఐ అధికారులు విచారించారు. కరూర్ దుర్ఘటనపై ఐపీఎస్ అధికారి ప్రవీణ్‌కుమార్ నేతృత్వంలో 12 మంది సీబీఐ బృందం విచారణ జరుపుతున్న విషయం విదితమే. ఆ సంఘటన జరిగిన వేలుచ్చామిపురాన్ని అత్యాధునిక సెన్సార్ పరికరాలతో పరిశీలించారు. అనంతరం వేలుచ్చామిపురానికి చెందిన 306 మంది విచారణకు హాజరుకావాలని సమన్లు పంపగా, వారిలో 28 మంది మాత్రమే హాజరై వివరణ ఇచ్చారు. అలాగే, ఘటన జరిగిన రోజున వేలుచ్చామిపురంలో భద్రతా విధులు చేపట్టిన 12 మంది కానిస్టేబుళ్లు, ఏడుగురు ఎస్ఐలను సీబీఐ అధికారులు వేర్వేరుగా విచారించారు. అనంతరం అంబులెన్స్ డ్రైవర్లు, యజమానులు అని 20 మందికి పైగా సమన్లు జారీచేసిన సీబీఐ అధికారులు, గత గురువారం నుంచి వారిని విచారిస్తున్నారు. రెండు రోజులుగా 11 మంది విచారణకు హాజరుకాగా, శనివారం 8 మంది హాజరరయ్యారు. తొక్కిసలాట ఎలా జరిగింది, వారిని ఎలా రక్షించారు తదితరాలపై అధికారులు ప్రశ్నించారు.

ప్రచార వాహనం సీసీ ఫుటేజీ అప్పగింత..

కరూర్ తొక్కిసలాట ఘటనకు సంబంధించి టీవీకే ప్రచార వాహనాలకు అమర్చిన సీసీ టీవీ కెమెరాల ఫుటేజీ సమర్పించాలని సీబీఐ సమన్లు జారీచేసిన నేపథ్యంలో, కరూర్ ప్రభుత్వ అతిథి గృహంలో ప్రచార వాహన సీసీ ఫుటేజీని ఆ పార్టీ న్యాయవాదులు, నిర్వాహకులు సీబీఐ అధికారులకు అప్పగించారు. శనివారం టీవీకే న్యాయవాది అరసు సహా ముగ్గురు నిర్వాహకులు సీసీ ఫుటేజీ, కార్యక్రమంలో పాల్గొన్న వారి వివరాలు, పలు రకాల దస్తావేజులతో కూడిన బ్యాగును సీబీఐ అధికారులకు అప్పగించారు.

ఆస్పత్రిలో వసతులు కల్పించండి మహాప్రభో

● అధికారులకు రోగుల విజ్ఞప్తి



తిరుత్తణి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి ప్రభుత్వ ఆస్పత్రిలో వసతులు కరువయ్యాయని రోగులు వాపోతున్నారు. ఆస్పత్రిలో మరుగుదొడ్లు శుభ్రం చేసేవారు లేరన్నారు. అదేవిధంగా ఆస్పత్రి ప్రాంగణంలో కుక్కలు, పశువులు యథేచ్ఛగా తిరుగుతూ రోగులపై దాడి చేస్తున్నాయన్నారు. ఆస్పత్రి వెలుపల చెత్తకుండీలో గత కొన్ని నెలలుగా వ్యర్థాలు పేరుకుపోయినప్పటికీ వాటిని తొలగించే వారే లేరన్నారు. దీంతో దోమలు అధికమై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణుల వార్డులో మహిళలు రోగాల బారిన పడుతున్నారని తెలిపారు. అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.



ఆస్పత్రి ప్రాంగణంలో తిరుగుతున్న పశువులు

రాష్ట్రం నుంచి కేరళకు వెళ్లే ప్రైవేటు బస్సుల నిలిపివేత

పెరంబూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కేరళ రాష్ట్ర అధికారులు రూ.70 లక్షల వరకు జరిమానా విధిస్తుండడంతో, రాష్ట్రం నుంచి కేరళకు వెళ్లే ప్రైవేటు బస్సులు శుక్రవారం సాయంత్రం నుంచి నిలిచిపోయాయి. చెన్నై, కోవై సహా ప్రధాన నగరాల నుంచి కేరళకు ప్రతిరోజూ 200కు పైగా ప్రైవేటు బస్సులు నడుస్తున్నాయి. శబరిమల సీజన్ కావడంతో, అదనపు బస్సులు నడిపేందుకు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో, రాష్ట్రం నుంచి శుక్రవారం సాయంత్రం 6 గంటలకు కేరళకు వెళ్లిన ప్రైవేటు బస్సుకు, ఆ రాష్ట్ర రవాణా శాఖ అధికారులు రూ.70 లక్షల వరకు జరిమానా విధించారు. అందుకు వ్యతిరేకత తెలిపిన ప్రైవేటు బస్సుల యజమానులు, శుక్రవారం సాయంత్రం నుంచి కేరళకు బస్సులు నడపడం నిలిపివేశారు. ఈ విషయమై ప్రైవేటు బస్సుల యజమానుల సంఘం అధ్యక్షులు అన్బళగన్ మాట్లాడుతూ... రోడ్డు పన్ను సహా పలు కారణాలు చూపుతూ, కేరళ రాష్ట్ర రవాణా శాఖ అధికారులు తమకు జరిమానా విధిస్తున్నారన్నారు. ఇరు రాష్ట్రాల అధికారులు చర్చలు జరిపి, ఈ సమస్యకు పరిష్కారం చూపాలని, అప్పటివరకు కేరళ రాష్ట్రానికి ప్రైవేటు బస్సులు నడపమని ఆయన తెలిపారు.

19లోపు టెన్త్ పబ్లిక్ పరీక్షల విద్యార్థుల జాబితా

పెరంబూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): టెన్త్ పబ్లిక్ పరీక్షలు రాయనున్న విద్యార్థుల వివరాలను ఈనెల 19వ తేదిలోపు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పరీక్ష శాఖ ఉత్తర్వులు జారీచేసింది. ప్రస్తుత విద్యా సంవత్సరం రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో టెన్త్ పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్ నమోదు గత నెల 6 నుంచి 23వ తేది వరకు జరిగిందన్నారు. ఈ జాబితాలో విద్యార్థుల పేర్లు, పుట్టిన తేది, లింగం, సెల్‌ఫోన్ నెంబరు, చిరునామా తదితరాల్లో లోపాలు ఉంటే సవరణలకు అవకాశం కల్పించామన్నారు. సవరించిన జాబితాను హెచ్ఎంలు మరోసారి పరిశీలించి, విద్యార్థుల వివరాల్లో ఎలాంటి లోపాలు లేవని నిర్ధారించి, ఆ జాబితాను ఈ నెల 19వ తేదిలోపు వెబ్‌సైట్‌లో నమోదుచేయాలని పరీక్ష శాఖ సర్క్యులర్‌లో తెలిపింది.

అరియర్ విద్యార్థులకు మద్రాసు వర్శిటీ చివరి అవకాశం

అడయార్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మద్రాసు విశ్వవిద్యాలయం దూరవిద్య విభాగంలో చదివిన విద్యార్థులు, తమ అరియర్ పరీక్షలు రాసేందుకు చివరి అవకాశం కల్పించింది. మద్రాసు విశ్వవిద్యాలయం దూరవిద్య విభాగంలో గత 1981-82 నుంచి 2018 వరకు యూజీ, పీజీ, డిప్లొమో, సర్టిఫికేటు కోర్సులు పూర్తిచేసి, అరియర్స్ ఉంచి విద్యార్థులు, పరీక్షలు రాసి అరియర్స్ ఉత్తీర్ణులయ్యేందుకు చివరి అవకాశం కల్పించామన్నారు. అందుకోసం డిసెంబరులో పరీక్షలు నిర్వహించనున్నామని తెలిపారు. ఈ పరీక్షలు రాసేందుకు ఆసక్తి ఉన్న అరియర్ విద్యార్థులు ఈ నెల 10వ తేదిలోపు దూరవిద్య సంస్థ వెబ్‌సైట్ www.ideunom.ac.inలో దరఖాస్తు చేసుకోవచ్చని మద్రాసు వర్శిటీ రిజిస్ట్రార్ రీటాజన్ తెలిపారు.

నా నియోజకవర్గం సమస్యలను పట్టించుకోని సీఎం స్టాలిన్!

● కాంగ్రెస్ ఎమ్మెల్యే పళనినాడార్ ఆరోపణ



చెన్నై, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తన నియోజకవర్గంలో ప్రధాన సమస్యలను తాను సీఎం స్టాలిన్ దృష్టికి తీసుకెళ్లినా నెరవేర్చలేదని తెన్‌కాశి కాంగ్రెస్ శాసనసభ్యుడు పళనినాడార్ ఆరోపించారు. నగరంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ శాసనసభ్యులను, నాయకులను డీఎంకే నేతలు ఏమాత్రం గౌరవించడమే లేదని, మిత్రపక్షంగా ఉన్న తమ పార్టీకి సానుకూలంగా వ్యవహరిస్తారని గత నాలుగేళ్లుగా ఎదురు చూసినా ప్రయోజనం లేకపోయిందని విమర్శించారు. డీఎంకే అధికారంలోకి వచ్చిన రెండో యేట శాసనసభ్యులంతా తమ నియోజకవర్గంలో ప్రధానమైన పది సమస్యలను వివరిస్తూ తనకు లేఖలు పంపితే వాటిని పరిష్కరిస్తానంటూ హామీ ఇచ్చారని, ఈ మేరకు రాతపూర్వకంగా సీఎంకు తెలియజేశానన్నారు. అయితే ఇప్పటి వరకూ ఒక్క సమస్యను కూడా పరిష్కరించకపోవడంతో నియోజకవర్గ ప్రజలంతా తనను తిడుతున్నారనని పళనినాడార్ వాపోయారు. తెన్‌కాశి నియోజకవర్గంలోని రెట్టయికుళం నుండి ఊత్తుమలై వరకు కాలువ నిర్మించాలని, కొత్తగా బస్ డిపో ఏర్పాటు చేయాలని, ఊత్తుమలైని విభజించాలని తాను సీఎంకు విజ్ఞప్తి చేశానన్నారు. ఈ సాధారణ డిమాండ్లను సైతం ఆయన పెడచెవిన పెట్టేశారని విమర్శించారు. దీనితో తాను నియోజకవర్గం ప్రజలకు ముఖం చాటేయాల్సిన దుస్థితి దాపురిస్తోందని పళనినాడార్ ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు తిరుచ్చికి సీఎం స్టాలిన్ పయనం

పెరంబూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి స్టాలిన్ పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ఈనెల 9న ఆదివారం తిరుచ్చి, పుదుకోటకు రాత్రి 9 గంటలకు చెన్నై నుంచి విమానంలో వెళ్లనున్నారు. పుదుకోట జిల్లా కలమావూరులో 10న సోమవారం జరగనున్న ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొననున్న సీఎం, 44 వేల మందికి రూ.348 కోట్ల విలువైన సంక్షేమ సహాయాలు అందజేయనున్నారు. సోమవారం ఉదయం 8.45 గంటలకు వయలూరులో శ్రీరంగం ఎమ్మెల్యే పళనియాండి ఇంట వివాహ వేడుకల్లో సీఎం పాల్గొననున్నారు. అక్కడి నుంచి కారులో పుదుకోట జిల్లా కలమావూరు మూకాంబిగై ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం 10 గంటలకు జరిగే ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొననున్నారు. కార్యక్రమంలో రూ.201.70 కోట్ల విలువైన 103 కొత్త పథకాలకు సీఎం శంకుస్థాపన చేయనున్నారు. అలాగే, రూ.223.06 కోట్లతో చేపట్టిన 577 పనులను ప్రారంభించనున్నారు. కార్యక్రమంలో భాగంగా రూ.348.43కోట్ల విలువైన సహాయాలను 44,093 మందికి అందజేయనున్నారు. కార్యక్రమం ముగిసిన తర్వాత కారులో తిరుచ్చి పొన్‌మలైలో వృద్ధాశ్రమాన్ని మధ్యాహ్నం 1 గంటకు ప్రారంభించనున్నారు. అనంతరం తిరుచ్చి ప్రభుత్వ అతిథిగృహానికి చేరుకోనున్న సీఎం, భోజనం అనంతరం విమానంలో మధ్యాహ్నం 3 గంటలకు నగరానికి చేరుకుంటారని సచివాలయం పేర్కొంది.

టీఎన్‌పీఎస్సీ గ్రూప్-4 పోస్టులు

●14 వరకు క్రీడాకారులు సర్టిఫికేట్ అప్‌లోడ్‌కు అవకాశం

పెరంబూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-4 పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన 690 మంది క్రీడాకారులు వారి సర్టిఫికేట్లు అప్‌లోడ్ చేయలేదు. అందువల్ల, ప్రభుత్వ ఉద్యోగాల్లో క్రీడాకారులు చేరేలా వారిని టీఎన్‌పీఎస్సీ ఒక వారం అవకాశం కల్పించింది. గ్రూప్-4 పరీక్షా ఫలితాలు అక్టోబరు 22వ తేది విడుదల చేశామనింది. క్రీడాకారుల కేటగిరీ కింద రిజర్వేషన్ కోటాలో 1,280 మంది ఉత్తీర్ణత సాధించారనింది. వారు క్రీడా పోటీల్లో సాధించిన సర్టిఫికేట్లు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్‌లో నమోదుకు ఈనెల 5వ తేదివరకు అవకాశం కల్పించింది. కానీ, వారిలో 590 మంది మాత్రమే సర్టిఫికేట్లు అప్‌లోడ్ చేశారని, మిగిలిన 690 మంది క్రీడాకారులు తమ సర్టిఫికేట్లు అప్‌లోడ్ చేసేందుకు ఈ నెల 14వ తేది వరకు అవకాశం కల్పించినట్లు టీఎన్‌పీఎస్సీ తెలియజేసింది.

తిరువళ్లూరు జిల్లా విద్యాశాఖ సీఈవోగా కర్పగం



తిరుత్తణి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా విద్యాశాఖ సీఈవోగా కర్పగం నియమితులయ్యారు. గతంలో ఈ జిల్లాలో చీఫ్ ఎడ్యుకేషన్ అధికారిగా విధులు నిర్వహించిన మోహన్ రాణిపేట జిల్లాకు బదిలీ అయ్యారు. ఈక్రమంలో కొత్త సీఈవోగా కర్పగంను నియమిస్తూ రాష్ట్ర విద్యాశాఖ ఇటీవల ప్రకటించింది. ఈ నేపథ్యంలో, శనివారం ఆమె తిరువళ్లూరులోని విద్యాశాఖ కార్యాలయంలో పదవీ బాధ్యతలను స్వీకరించారు. డీఈవో అముదా, కలెక్టర్ పీపీ భవానీ, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ చౌదరి, విద్యాశాఖ అధికారులు మీనాక్షికుమారి, దండపాణి, రాష్ట్ర ఉపాధ్యాయుల సంఘ కార్యదర్శి దాస్, రాష్ట్ర ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు అరుణ్ తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.

వేలూరు యువతి చిత్తూరులో ఆత్మహత్యాయత్నం

చిత్తూరు రూరల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): చిత్తూరు రైల్వేస్టేషన్ సమీపంలో ఓ యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల సమాచారం మేరకు.... శుక్రవారం రాత్రి ఎక్స్‌ప్రెస్ రైలు చిత్తూరు రైల్వే స్టేషన్ నుంచి తిరుపతి వైపుకు కదులుతుండగా, స్టేషన్ సమీపంలో తమిళనాడు రాష్ట్రం వేలూరుకు చెందిన యువశ్రీ(21) అనే యువతి రైలు కింద పడి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనలో ఆమె ఎడమ కాలు మాత్రం రైలు చక్రాల కింద పడి నలిగింది. ఆమెను రైల్వే అధికారులు చికిత్సల కోసం వేలూరు సీఎంసీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

SUNDAY SPECIAL

మూడు దశాబ్దాల కళామతల్లి సేవ

ఆధునిక నాటక రంగంలో బహుముఖ ప్రజ్ఞాశాలి మురుగభూపతి



కళాకారులతో మురుగభూపతి

"నాటక రంగాన్ని, రంగస్థల కళాకారులను విద్యా సంస్థలు ప్రోత్సహించాలి. ఈ విషయంలో ప్రభుత్వం కూడా ప్రధాన భూమికను పోషించాలి. విద్యారంగంలో నాటకాలకు ప్రాధాన్యం కల్పించాలి. ప్రతి బడిలోనూ డ్రాయింగ్ మాస్టర్‌లా రంగస్థలంపై అనుభవం కలిగినవారిని డ్రామా మాస్టార్ పోస్టులో నియమించి బడిపిల్లలకు నాటకాల గురించి పాఠాలు బోధించాలి. ఇవన్నీ జరిగితే నాటకరంగం కలకాలం మనగలుగుతుంది"... అంటూ కోవిల్‌పట్టికి చెందిన రంగస్థల కళాకారుడు డాక్టర్ ఎస్.మురుగ భూపతి సూచనలివి. రంగస్థలంలో మూడు దశాబ్దాలకు పైగా నటుడిగా, సంభాషణల రచయితగా, దర్శకుడిగా, సంగీత దర్శకుడిగా బహు పాత్రాభినయాన్ని సమర్థవంతంగా పోషిస్తున్న ప్రజ్ఞాశాలి ఆయన. అంతేకాదు నాటక రంగంపై పరిశోధనలు చేసి పీహెచ్‌డీ పట్టాను పొందారు. 'మణల్‌మగుడి నాడగ నిలమ్' పేరుతో నెలకొల్పిన నాటక సంస్థ ద్వారా ప్రపంచవ్యాప్తంగా తమిళ సంస్కృతీ సంప్రదాయాలు, సాహిత్యం, తమిళుల ప్రాచీన చరిత్ర, కీర్తి ప్రతిష్టతలను ఎలుగెత్తి చాటే విధంగా ఎన్నో నాటకాలను ప్రదర్శిస్తూ ఆధునిక నాటక రంగానికి జవసత్వాలు అందించి ఊపిరిపోస్తున్నారు.

- టి.నగర్, ఆంధ్రజ్యోతి



నాటక ప్రదర్శనలో మురుగభూపతి బృందం









రంగస్థల అంశాలపై పరిశోధన...

మురుగభూపతి తాత మధుర కవి భాస్కరదాస్ స్వాతంత్ర్య సమరయోధుడు, బ్రిటిష్ ప్రాలకుల అరాచకాలను కళ్ళకు కట్టినట్లు పామరులు సైతం సులభంగా అర్థం చేసుకునేలా నాటకాలను రచించి, రక్తికట్టించేలా ప్రదర్శించేవారు. ఆ కారణంగానే ఆయన రచించిన నాటకాలపై అప్పటి బ్రిటిష్ ప్రభుత్వం నిషేధం విధించింది. అప్పట్లో ఎంతోమంది సాహితీవేత్తలు, రచయితలు భాస్కరదాస్ నివాసానికి వచ్చివెళుతుండేవారు. ప్రముఖ రచయితలు కోణంగి, తమిళసెల్వన్ స్వయానా మురుగభూపతికి సోదరులు. ఈ కారణాలవల్లే వంశపారంపర్యంగా మురుగభూపతికి కూడా నాటక రంగంపై ఆసక్తి పెరిగి, నాటకాలకు సంభాషణలు సమకూర్చి దర్శకత్వం వహించారు. రంగస్థలానికి సంబంధించిన అంశాలపైనే ఎంఏ, ఎంఫిల్., పీహెచ్‌డీ కూడా చేశారు. ఆధునిక నాటక రంగంలో నటుడిగా నాటక దర్శకుడిగా, సంగీత కళాకారుడిగా, సంభాషణల రచయితగా ఆయన బహుముఖ ప్రజ్ఞాశాలిగా కీర్తి గడించారు. తమిళ రంగస్థల కళాకారుల ఆర్థిక పరిస్థితులు ప్రస్తుతం వారి జీవనానికి చాలినంతగా లేవు. అయితే నాటకరంగంలో ఒకసారి అడుగుపెడితే ఆ కళ మోహినిలా అల్లుకుపోతుంది. ఒకే సమయంలో వేలాదిమంది ప్రేక్షకులను తమ నటనతో వారి బాధలను తాత్కాలికంగా పారద్రోలే అపారమైన శక్తి సామర్థ్యాలు రంగస్థల కళాకారులకే ఉంది. మానవుల భావోద్వేగాలకు చికిత్సలందించే శక్తి నాటకరంగానికి ఉందని ఆయన విశ్వసిస్తున్నారు. నటనానుభవంతో మీరెందుకు సినిమాల వైపు ఎందుకు వెళ్లలేదంటూ ఆయన్ని ప్రశ్నిస్తుంటారు. సినిమాలు, నాటకాలు వేర్వేరు రంగాలు. నాటక కళ చరిత్ర గుహాయుగంలోనే ప్రారంభమైందని చెబుతారు. సినిమాలకు లభించే అవార్డులు నాటకాలకు లభించడం లేదు. పాఠశాలలు, కళాశాలల్లో డ్రామా టీచర్లను నియమిస్తే రంగస్థలం ఉన్నతస్థితికి చేరుతుందని, రంగస్థల బాధకసాధకాలపై అవగాహన ఏర్పడుతుందని ఆయన చెబుతున్నారు.



డాక్టర్ మురుగభూపతి

మహిళలకు ప్రాధాన్యం...

నాటక కళ అభివృద్ధి చెందటానికి సలహాలను గురించి చెబుతూ 'ఈ కళను విద్యా సంస్థలే అభివృద్ధి పరచాలి. నేటి తరానికి ఈ విషయాన్ని నొక్కిచెప్పాలి. ప్రభుత్వం కూడా తన వంతు పాత్రను పోషించాలి. విద్యలో నాటకాన్ని కూడా చొప్పించాలి. నేటి మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై నాటకాల్లో ప్రస్తావించాలి. మహిళల కోసమే 'ఉడల్ తిరక్కుమ్ నాటక నిలమ్' అనే పుస్తకం రాశాను. ఆడపిల్లల్ని ఎల్లప్పుడూ అణగదొక్కుతూ వస్తున్నాం. అతడితో మాట్లాడొద్దు.. అతడితో తిరుగుళ్లేమిటి? అంటూ ఆంక్షలు పెడుతూనే ఉన్నాం. అయితే నాటకాలలో నటించే మహిళలు మాత్రం తమకేదో స్వేచ్ఛాస్వాతంత్ర్యాలు లభించినంతగా సంతోషపడుతున్నారు. అది ఈ కళకు ఉన్న అపారమైన శక్తి అని చెప్పొచ్చు. నాటకరంగం అభివృద్ధి చెందితే సామాజిక మార్పులు వేగంగా జరుగుతాయని భావిస్తున్నాను.' అని పేర్కొన్నారు.

ఆత్మసంతృప్తి...

'వయోభేదం లేకుండా మహిళలు నాటక రంగంలో రాణించాలి. వీధిభాగోతాల ద్వారానే హిజ్రాలు స్వతంత్రంగా ఉంటున్నారు. నాటక కళలో మహిళలకు పూర్తి స్వేచ్ఛ ఉంది. 70 మంది మహిళలతో 'బాలామణి' నటించిన ఆనాటి కాలమే కళారంగంలో స్వర్ణయుగం. నాటకరంగంలో మహిళలకు అధిక ప్రాధాన్యం కల్పిస్తే ఆత్మసంతృప్తి కలుగుతుందని మురుగభూపతి చెబుతున్నారు. ప్రస్తుతం మావంటి నాటక కళాకారులకు ఎదురయ్యే సమస్యలకు సంబంధించిన కథతో కొత్త నాటకాన్ని రచిస్తున్నాను. నా నాటకాల్లో బాగా నచ్చినవి 'సెమ్ముతాయ్', 'శూరణాంగు'. అణంగు అనే పదానికి సంగకాల సాహిత్యంలో దైవత్వం, రాక్షసత్వం అనే అర్థాలున్నాయి. పరిస్థితులను బట్టి మహిళలు దేవతలుగా, రాక్షసులుగాను ప్రవర్తిస్తారని ఆ పదమే చెబుతుంది. 'శూరణాంగు' నాటకంలో మహిళలే నటించారు. 'వనత్తాది', 'కూందల్‌నగరం', 'సెమ్ముతాయ్' 'కుట్రమ్ పత్రియ ఉడల్', 'మృగవిదూషం', 'గుహైమర వాసిగళ్' అనే నాటకాలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. ప్రస్తుతం నాటకరంగంలో మహిళల సంఖ్య తక్కువగా ఉన్నట్లు అనిపించవచ్చు. అయితే భవిష్యత్తులో నాటకరంగం బరువు బాధ్యతలను మహిళలే మోస్తారని విశ్వసిస్తున్నాను. ప్రస్తుతం మహిళలలో స్వీయచింతన లేదా ఆత్మపరిశీలన అధికమవుతోంది. కనుక భవిష్యత్ ఆశాజనకంగానే ఉంటుంది. ప్రస్తుతం 'మురుగభూపతియిన్ 23 నాడగంగళ్' అనే సంకలనం రాస్తున్నా. త్వరలో ఆవిష్కరించనున్న ఆ గ్రంథం నాటక రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకువస్తుందని ఆశిస్తున్నా'- మురుగభూపతి పలికిన ఈ మాటల్లో ఆయనకున్న ఆత్మవిశ్వాసం సుస్పష్టమవుతోంది.



రిహార్సల్స్‌కు సిద్ధమవుతున్న కళాకారులు

యువతకు సలహా...

సాహిత్యమో, నాటకమో, సంగీతమో, చిత్రలేఖనమో కళల వైపు యువకులు దృష్టి సారించాలని, నాటకాలు మానసిక ప్రశాంతతను చేకూరుస్తాయని, నటించేటప్పుడు పాత్రలో లీనమైనప్పుడు తాత్కాలికంగా తమను తామే మరచిపోతారని, వీలున్న సమయాలలో యువతీ యువకులు నాటకాల్లో నటించాలని ఆయన చెబుతున్నారు. చదువులతో పాటు సాహిత్య, సంగీత, నాటకరంగాల వైపు దృష్టి సారించాలన్నదే నేటి యువతకు నేనిచ్చే సలహా అన్నారు. మురుగభూపతి చెబుతున్న మాటలన్నీ నాటకరంగం భవిష్యత్ బాగుంటుందని స్పష్టపరిచేలా ఉన్నాయి. ఆధునిక నాటకరంగం అభివృద్ధికోసం తన జీవితాన్నే అంకితమొనర్చి ఆ రంగాన్ని ఉన్నతమైన వేదికపై చేర్చాలని తపిస్తున్న డాక్టర్ మురుగభూపతి సంకల్పం నెరవేరాలని ఆశిద్దాం!

'నలం కాక్కుం స్టాలిన్' పథకం

● 484 శిబిరాల్లో 7.57 లక్షల మందికి లబ్ధి



వైద్యశిబిరాన్ని పరిశీలిస్తున్న మంత్రి సుబ్రమణ్యం

పెరంబూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): 'నలం కాక్కుం స్టాలిన్' పథకానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం తెలిపారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ పరిధిలోని కోడంబాక్కం మండలం అశోక్‌నగర్ కలైంజర్ కరుణానిధి నిర్మల బాలికల మహోన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన 'నలం కాక్కుం స్టాలిన్' ప్రత్యేక వైద్యశిబిరాన్ని మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ప్రతి శనివారం రాష్ట్రంలోని 38 రెవెన్యూ జిల్లాల్లో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. గత వారం వరకు 484 శిబిరాలు నిర్వహించగా, 7,57,168 మంది లబ్ధిపొందారని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకం ద్వారా 1,256 శిబిరాలు నిర్వహించాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. జీసీసీలో 15 శిబిరాలు, చెన్నై తర్వాత 10 లక్షల మంది జనాభా ఉన్న 5 కార్పొరేషన్లలో తలా నాలుగు చొప్పున 20 శిబిరాలు, 10 లక్షల జనాభా కంటే తక్కువ ఉన్న 19 కార్పొరేషన్లలో తలా 3 చొప్పున 57 శిబిరాలు నిర్వహించనున్నామని తెలిపారు. 14వ శిబిరంగా శనివారం రాష్ట్రవ్యాప్తంగా 39 ప్రాంతాల్లో మొత్తం 523 శిబిరాలు నిర్వహించినట్లు మంత్రి తెలిపారు.

గౌరీ కిషన్‌కు సారీ చెప్పిన యూట్యూబర్



యూట్యూబర్ ఆర్ఎస్ కార్తీక్, హీరోయిన్ గౌరీ కిషన్

తమిళ మూవీ 'అదర్స్' మూవీ హీరోయిన్‌గా నటించిన కేరళ బ్యూటీ గౌరీ కిషన్ బరువు గురించి అడిగి తీవ్ర విమర్శలకు గురైన యూట్యూబర్ ఎట్టకేలకు ఆమెకు క్షమాపణ చెప్పాడు. అదర్స్ మూవీలో ఓ పాట దృశ్యంలో హీరో ఆదిత్యా మాధవన్ గౌరీ కిషన్‌ను మోస్తూ డ్యాన్స్ చేస్తున్న దృశ్యాన్ని ప్రస్తావిస్తూ ఆ యూట్యూబర్ బరువెంతై ఉంటుందని అడిగిన ప్రశ్నపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. నడిగర్ సంఘం, ప్రెస్‌క్లబ్, కేరళ మూవీ సంఘాలు యూట్యుబర్‌పై తీవ్రంగా ఖండిస్తూ ప్రకటనలు జారీ చేశాయి. ఈ నేపథ్యంలో యూట్యూబర్ ఆర్ఎస్ కార్తీక్ హీరోయిన్ గౌరీ కిషన్‌కు క్షమాపణలు చెబుతూ ఓ వీడియోను విడుదల చేశారు. గౌరీ కిషన్ బరువు గురించి తానడిగిన ప్రశ్నను తప్పుగా అర్థం చేసుకున్నారని, ఏదిఏమైనప్పటికీ తన ప్రశ్న వల్ల ఆమెకు కలిగిన బాధను అర్థం చేసుకుని క్షమాపణలు తెలుపుకుంటున్నానని పేర్కొన్నారు.

కవిన్, ఆండ్రియా నటిస్తున్న మూవీ 'మాస్క్'

● నేడు ట్రైలర్ రిలీజ్



వికర్ణన్ అశోక్ డైరెక్టర్‌గా పరిచయమవుతున్న మూవీ 'మాస్క్'. బిగ్‌బాస్ ఫేమ్ కవిన్ హీరోగా నటిస్తున్నారు. అతడి సరసన తెలుగు నటి రుహానీ శర్మా హీరోయిన్‌గా నటిస్తోంది. అందాల భామ ఆండ్రియా ప్రధాన పాత్రలో నటిస్తోంది. చార్లీ, బాలాశరవణన్, విజే అర్చనా తదితరులు నటించిన ఈ మూవీకి జీవీ ప్రకాష్ సంగీతం అందిస్తున్నారు. ఈ మూవీలోని 'కణ్ణుముళి' అనే సింగిల్ సాంగ్ ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. ఈ నెల 21న విడుదల అవుతుందని ట్రైలర్‌ను విడుదల చేస్తామని డైరెక్టర్ వికర్ణన్ అశోక్ తెలిపారు. ఈ చిత్రంలో కవిన్, ఆండ్రియా నటించిన దృశ్యాలు అద్భుతంగా షూట్ చేశామని చెప్పారు.

చిత్రజ్యోతి

'రెట్ట తల'లో అరుణ్ విజయ్ డబుల్ రోల్



ధనుష్ దర్శకత్వంలో ఇటీవల విడుదలైన సూపర్‌హిట్ మూవీ 'ఇడ్లీ కడై'లో స్టయిలిష్ విలన్‌గా నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్న నటుడు అరుణ్ విజయ్ తాజాగా నటిస్తున్న మూవీ 'రెట్ట తల'. శివకార్తికేయన్ నటించిన 'మాన్ కరాటే'కి దర్శకత్వం వహించిన తిరుక్కుమరన్ ఈ మూవీకి దర్శకత్వం వహిస్తున్నారు. అరుణ్‌విజయ్ సరసన సిద్దీ ఇద్నాని హీరోయిన్ నటిస్తోంది. ఈ భామ ఇదివరకే శింబు నటించిన 'వెన్దు తనిందదు కాడు'లో హీరోయిన్‌గా నటించింది. ధన్యా రవిచంద్రన్ కీలకమైన పాత్రలో నటిస్తోంది. శ్యామ్ సి.ఎస్ సంగీతం అందిస్తున్నారు. పీటీజీ యూనివర్శల్ సంస్థ ఈ చిత్రాన్ని నిర్మించింది. ఈ మూవీ టీజర్, ఫస్ట్ సింగిల్ సాంగ్ ఇటీవల రిలీజై నెటిజన్ల నుంచి వేల సంఖ్యలై 'లైక్'లను సంపాదించుకుంది. ఈ నేపథ్యంలో చిత్రాన్ని ఈ నెల 18న విడుదల చేస్తామని చిత్ర సమర్పకులు ప్రకటించారు.

24 నుంచి 'అరసన్' షూటింగ్ ప్రారంభం

ఉత్తర చెన్నైలో జరిగే సంఘటనల ఆధారంగా వెట్రిమారన్ దర్శకత్వంలో శింబు నటిస్తున్న కొత్త చిత్రం 'అరసన్'. ఇందులో శింబు యువకుడిగా, వృద్ధుడిగా డ్యుయల్ రోల్‌లో నటించనున్నారు. సముద్రగని, కిషోర్, ఆండ్రియా, డైరెక్టర్ నెల్సన్ ఇతర తారాగణం. అనిరుద్ధ్ సంగీతం అందిస్తున్నారు. ప్రముఖ నిర్మాత కలైపులి ఎస్ థాను ఈ మూవీని నిర్మిస్తున్నారు. 'తగ్ లైఫ్' తర్వాత శింబు నటిస్తున్న ఈ చిత్రం ఆయన కెరీర్‌లో ఓ మలుపు అవుతుందని వెట్రిమారన్ చెబుతున్నారు. ఉత్తర చెన్నై గ్యాంగ్‌స్టర్ మూవీ ఈ చిత్రం ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంటుందని కూడా తెలిపారు.



శింబు

అవగాహనతోనే వక్షోజ క్యాన్సర్‌కు విముక్తి

● డాక్టర్ సెల్వీ రాధాకృష్ణన్



క్యాన్సర్ విముక్త మహిళలతో డాక్టర్ సెల్వీ రాధాకృష్ణన్ ఇతర వైద్యనిపుణులు

చెన్నై, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వక్షోజ క్యాన్సర్‌పై మహిళల్లో పాతుకుపోయిన భయాన్ని ముమ్మర అవగాహన ప్రచార కార్యక్రమాల ద్వారా పారద్రోలవచ్చని చెన్నై బ్రెస్ట్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ సెల్వి రాధాకృష్ణన్ అన్నారు. శనివారం ఉదయం ఆ సెంటర్ వద్ద జరిగిన వక్షోజ క్యాన్సర్ విముక్తుల దినం సందర్భంగా 'ఎంగల్ ఉత్సవ్' పేరుతో వక్షోజ క్యాన్సర్ నుంచి కోలుకున్న 250 మంది మహిళలతో ప్రత్యేక అవగాహన ప్రచార కార్యక్రమాలను నిర్వహించింది. ఆ సందర్భంగా ఆమె ప్రసంగిస్తూ వక్షోజ క్యాన్సర్‌ను ప్రాథమిక స్థాయిలోనే గుర్తిస్తే బయటపడవచ్చన్నారు. వైద్యులు సలహాల ప్రకారం స్వీయపరీక్షలు కూడా చేసుకోవచ్చన్నారు. ఈ వేడుకలను శరణా బ్రెస్ట్ క్యాన్సర్ రిలీఫ్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించినట్లు ఆమె తెలిపారు. లైఫ్ స్టయిల్ మెడిసిన్ ఎక్స్‌పర్ట్ డాక్టర్ షీలా నంబియార్, ప్లాస్టిక్ సర్జెన్ డాక్టర్ వెంకట్ రామకృష్ణన్, హెల్త్ ఇన్సూరెన్స్ స్పెషలిస్ట్ డాక్టర్ ఎస్. ప్రకాష్ తదితరులు ఈ వేడుకల్లో ప్రసంగించారు.



రిప్పన్ భవనం వద్ద పోలీసుల పహారా

వంద రోజులకు చేరిన పారిశుధ్య కార్మికుల ఆందోళన

● రిప్పన్ భవనం వద్ద పోలీసుల మొహరింపు

చెన్నై, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్ల సాధన కోసం కార్పొరేషన్ పారిశుధ్య కార్మికులు ప్రారంభించిన ఆందోళన శనివారంతో 100 రోజులను పూర్తి చేసుకుంది. ఆ సందర్భంగా కార్మికులు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం రిప్పన్ భవనం వద్ద భారీ ధర్నా చేయడానికి సిద్ధమవుతున్నట్లు సమాచారం అందడంతో శనివారం వేకువజామునే పోలీసులు పెద్ద సంఖ్యలో ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ఆగస్టు 1న రిప్పన్ భవనం ప్రధాన ప్రవేశద్వారం వద్ద పారిశుధ్య కార్మికులు ఆందోళనకు దిగారు. 13 రోజుల తర్వాత పోలీసులు అర్ధరాత్రి బలప్రయోగంతో వారిని అరెస్టు చేసి తరలించారు. ఈ వ్యవహారానికి సంబంధించిన కేసు విచారణ హైకోర్టులో పెండింగ్‌లో ఉంది. అదే సమయంలో పారిశుధ్య కార్మికులు వివిధ రూపాల్లో ఆందోళనలు జరుపుతూ వచ్చారు. మూడు రోజులకు ముందు మెరీనాలో సముద్రంలో దిగి కలకలం సృష్టించారు. ఈ నేపథ్యంలో వందరోజులు పూర్తయిన సందర్భంగా రిప్పన్‌భవనం ఎదుట మళ్లీ వారు ఆందోళన జరుపుతారని భావించి ఆ ప్రాంతం వద్ద పోలీసులను పెద్ద యెత్తున మొహరించారు. శనివారం వేకువజాము నుండి రాత్రి 7 గంటల దాకా పోలీసులు ఆ భవనం చుట్టూ కాపలా కాశారు. కార్మికులెవరూ రాకపోవడంతో రాత్రి ఎనిమిది గంటలకు పోలీసులు అక్కడి నుంచి తిరుగుప్రయాణమయ్యారు.



వేడుకగా కేక్ మిక్సింగ్

చెన్నై, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పండుగ సమీపిస్తున్న తరుణంలో నగరంలో కేక్ మిక్సింగ్ ప్రారంభమైంది. 'గ్రాండ్ చెన్నై' ఆధ్వర్యంలో క్రిస్మస్ స్ఫూర్తిని సంప్రదాయం, ఆనందం, సమాజం పట్ల శ్రద్ధను మిళితం చేసిన కేక్ మిక్సింగ్ వేడుకను నిర్వహించారు. వైన్ సోమెలియర్ నిపుణుల ఆధ్వర్యంలో గ్రాండ్ వైన్ టేస్టింగ్ సెషన్‌తో ఈ కార్యక్రమం మరింత ఉన్నతస్థాయికి చేరుకుంది. 70 మంది అతిథులతో నిర్వహించిన ఈ కార్యక్రమానికి 25 మంది పేద చిన్నారులు కూడా హాజరై ఆస్వాదించారు. ఈ సందర్భంగా జీఆర్‌టీ హోటల్స్ అండ్ రిసార్ట్స్ సీఈవో విక్రమ్ కోటా మాట్లాడుతూ.. తమ వార్షిక కేక్ మిక్సింగ్ కార్యక్రమాన్ని కమ్యూనిటీలోని చిన్నారులతో కలిసి పంచుకోవడం సంతోషంగా వుందని తెలిపారు.

ఘనంగా టీసీఏ అవార్డుల ప్రదానోత్సవం



అవార్డులందుకున్న సీఏ విద్యార్థులతో కార్తీక్ మనికొండ, నివేదా

చెన్నై, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): సీఏ ఫౌండేషన్ ఇంటర్మీడియట్ అత్యుత్తమ ఫలితాలతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు టీసీఏ అవార్డులతో సత్కరించారు. స్థానిక మైలాపూరు రసిక రంజన్ సభలో ప్రముఖ ఆన్‌లైన్ సీఏ కోచింగ్ సంస్థల్లో ఒకటైన 'ది సీఏ క్లాస్‌రూమ్' సంస్థ ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు కార్తీక్ మణికొండ, నివేదా శంకర్, కేపీఎంజీ డైరెక్టర్ విజయ్ ఆర్, ప్యాకల్టీ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతుల నుండి మూడేళ్లలో 6,453 టన్నుల రాగుల కొనుగోలు

● మంత్రి చక్రపాణి



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి చక్రపాణి

ప్యారీస్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రైతుల నుండి మూడేళ్లలో 6,453 టన్నుల రాగులు కొనుగోలు చేసి రూ.26.48 కోట్లు పంపిణీ చేసినట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి ఆర్.చక్రపాణి తెలిపారు. ధాన్యం కొనుగోలు పథకం కింద వరి సాగు చేస్తున్న రైతులు, చిరుధాన్యాలు దిగుబడి చేస్తున్న రైతుల నుంచి ప్రతి సీజన్‌లో కొనుగోలు చేసే ధాన్యానికి అప్పటికప్పుడు నిధులు అందజేస్తున్నట్లు తెలిపారు. గత 2022-23లో ధర్మపురి, కృష్ణగిరి జిల్లాల్లో 514 టన్నుల రాగులు కొనుగోలు ప్రారంభించామని, రెండో విడతగా 2023-24లో ఈరోడ్, సేలం జిల్లాల్లో మొత్తం 1,889 మెట్రిక్ టన్నుల రాగులు కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఆ తర్వాత గత సంవత్సరం ధర్మపురి, కృష్ణగిరి, ఈరోడ్, సేలం జిల్లాల రైతుల నుండి 4,050 టన్నులు రాగులు కొనుగోలు చేసినట్లు మంత్రి వివరించారు. ఈ రకంగా మూడేళ్లలో 6,453 టన్నుల రాగులను 3,578 రైతుల నుంచి కొనుగోలు చేసి రూ.26.48 కోట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం నవంబరు 1వ తేదీ నుండి రైతుల నుంచి కొనుగోలు చేసిన రాగులకు టన్నుకు రూ.48,860 గిట్టుబాటు ధర అందించినట్లు మంత్రి చక్రపాణి తెలిపారు.







హర్దీప్ సింగ్ పూరి - ఆర్కే రోజా - కుటుంబ సభ్యులతో అర్జున్ - ప్రియ - మాన్య



జస్టిస్ సుధీర్ కుమార్

శ్రీవారిసేవలో ప్రముఖులు

తిరుమల, నవంబరు8(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో కేంద్రమంత్రి హర్దీప్ సింగ్ పూరి, మద్రాసు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధీర్ కుమార్, రాష్ట్ర మాజీ మంత్రి ఆర్కే. రోజా ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో ఆలయంలోకి వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే సినీ హీరో అర్జున్, నివేదిత దంపతులు, వారి కుమార్తెలు హీరోయిన్ ఐశ్వర్య, అంజన, నటి ప్రియ, గాయని మాన్య కూడా తిరుమలేశుడ్ని దర్శించుకున్నారు. దర్శనానంతరం హీరో అర్జున్ మీడియాతో మాట్లాడారు.. తాను నిర్మాత, దర్శకుడిగా వ్యవహరించి చిత్రీకరించిన 'సీతా పయణం' చిత్రం వచ్చే నెలలో విడుదలవుతుందన్నారు.


శ్రీవారి సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లలో సర్వదర్శన భక్తులు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.3.80 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 68,075

తలనీలాలు సమర్పించినవారు: 26,535



కుప్పం @ ఇండస్ట్రియల్ హబ్

- రూ.2,203 కోట్ల పెట్టుబడితో 7పరిశ్రమలకు సీఎం శంకుస్థాపన
- 22వేలమందికి ఉపాధి అవకాశాలు

హిందాల్కో కంపెనీ శంకుస్థాపన సందర్భంగా ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు, హాజరైన కలెక్టర్ తదితరులు





కుప్పం, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కుప్పం యువత కలలు పండనున్నాయి.వలసలను ఆపి ఉపాధి అవకాశాలను పుష్కలంగా పెంచే జాతీయ, అంతర్జాతీయ పరిశ్రమలు ఇక్కడకు తరలి వస్తున్నాయి.కుప్పంలో ఏకంగా ఏడు పరిశ్రమలకు ముఖ్యమంత్రి చంద్రబాబు శనివారం వర్చువల్‌గా శంకుస్థాపన చేశారు.రూ.2,203 కోట్ల పెట్టుబడితో ఏర్పాటు కానున్న ఈ పరిశ్రమలతో 22వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయని ప్రకటించారు. రాబోయే మూడు నెలల కాలంలో రూ.6,630 కోట్లతో మరో 8 పరిశ్రమలు తెస్తామని, వీటి ద్వారా ఏకంగా 43 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆయన చెప్పారు.శంకుస్థాపన కార్యక్రమంలో కుప్పంనుంచి ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్,ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, పీకేఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ సురేశ్‌బాబు, కడా పీడీ వికాస్ మర్మత్,ఆయా కంపెనీల సీఈవోలు, ఇతర ముఖ్య ప్రతినిధులు,ప్రజాప్రతినిధులు, అధికార కూటమి పార్టీలకు చెందిన నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయాధారిత పరిశ్రమలే అధికం

కుప్పంలో ఏర్పాటు కాబోయే 7 పరిశ్రమల్లో వ్యవసాయ, పాడి ఆధారిత పరిశ్రమలే అధికం. శాంతిపురం మండలం తమ్మిగానిపల్లెలో స్థాపించనున్న మదర్ డెయిరీ ఫ్రూట్ పల్ప్ ప్రాసెసింగ్ యూనిట్, గుడుపల్లె మండలం పొగురుపల్లెలో ఏర్పాటు చేయనున్న శ్రీజ మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్, ఎస్వీఎఫ్ సోయా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి చెందిన ఎడిబుల్ ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ అండ్ ప్రాసెసింగ్ యూనిట్, ఏస్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీకి చెందిన ఫుడ్ అండ్ డెయిరీ ఇంగ్రెడియంట్స్ యూనిట్లు వ్యవసాయ, పాడి ఆధారిత పరిశ్రమలే. మదర్ డెయిరీ ఫ్రూట్‌పల్ప్ ప్రాసెసింగ్ యూనిట్‌కు 41.22 ఎకరాలు, శ్రీజ మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్‌కు చెందిన డెయిరీ రిలేటెడ్ ప్రొడక్ట్స్ ప్రాసెసింగ్ అండ్ అనిమిల్ ఫీడ్‌కు 47.49 ఎకరాలు, ఎస్వీఎఫ్ సోయా ప్రైవేట్ లిమిటెడ్‌కు 18.68 ఎకరాలు, ఫుడ్ అండ్ డెయిరీ ఇంగ్రెడియంటడ్స్‌కు 73.63 ఎకరాల భూమిని కేటాయించారు. అలాగే కుప్పం పురపాలక సంఘ పరిధిలోని పల్లారపల్లె వద్ద ఏర్పాటు కానున్న అలీప్ పరిశ్రమకు చెందిన ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ ఉమెన్ గ్రీన్ అండ్ సస్టైనబుల్ ఇండస్ట్రియల్ పార్క్ (మహిళా శక్తి భవన్)కోసం 18.7 ఎకరాలు, రామకుప్పం మండలం విజలాపురం వద్ద ఏర్పాటు కానున్న ఈ-రాయిస్ మోటార్స్ కంపెనీకి చెందిన ఎలక్ట్రిక్ వెహికల్స్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్‌కు 25 ఎకరాలు, హిండాల్కర్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ కంపెనీకి చెందిన ఇంటిగ్రేటెడ్ అల్యూమినియం ఎక్స్‌ట్రాక్షన్ ఫ్యాక్టరీకి 16.3 ఎకరాల కేటాయింపు జరిగింది. ఈ మొత్తం పరిశ్రమల స్థాపనవల్ల ప్రత్యక్షంగా 7,093 మందికి, పరోక్షంగా 15,237 మందికి ఉద్యోగ, ఉపాధి కల్పన సాధ్యమవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

కంపెనీ	పెట్టుబడి (రూ.కోట్లలో)	ఉపాధి కల్పన	
		డైరెక్ట్	ఇన్‌డైరెక్ట్
అలీప్	26.7	1,000	2,500
మదర్ డెయిరీ	260	850	3,150
ఏస్ ఇంటర్నేషనల్	525	2,000	5,000
ఈ-రాయిస్ మోటార్స్	200	280	130
శ్రీజ మిల్క్	233	850	3,150
హిందాల్కో ఇండస్ట్రీస్	586	613	307
ఎస్వీఎఫ్ సోయా	372.8	1,500	1000

తిరుమలలో నేడు కార్తీక వనభోజనం

తిరుమల, నవంబరు8(ఆంధ్రజ్యోతి): కార్తీక వనభోజన కార్యక్రమానికి టీటీడీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఏటా కార్తీకమాసంలో పాపవినాశన మార్గంలోని పార్వేట మండపంలో ఈకార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీ. ఈక్రమంలో ఆదివారం ఉదయం మలయప్పస్వామి చిన్న గజవాహనంపై, ఉభయనాంచారులు పల్లకీపై బయలుదేరి ఊరేగింపుగా పార్వేట మండపానికి వేంచేపు చేస్తారు. ఉదయం 11 నుంచి 12 గంటల మధ్య స్వామికి స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకిస్తారు. మధ్యాహ్నం ఒంటి గంటకు వనభోజనం కార్యక్రమం జరుగుతుంది. మండపం సమీపాన అటవీప్రాంతంలో ఉన్న భక్తులందరికీ అన్నప్రసాదాలను అందించనున్నారు. ఇందుకోసం ప్రత్యేక క్యూలైన్లు, షెడ్లు ఏర్పాటు చేశారు. వనభోజన కార్యక్రమం నేపథ్యంలో కల్యాణోత్సవం, ఊంజల్‌సేవ, ఆర్జితబ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టీటీడీ రద్దు చేసింది.

కల్యాణకట్ట, లడ్డూకౌంటర్ల వద్ద హెల్ప్ డెస్కులు

- అధికారులకు అదనపు ఈవో ఆదేశం



తిరుమల, నవంబరు8(ఆంధ్రజ్యోతి): కల్యాణకట్ట, లడ్డూ కౌంటర్ల వద్ద హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేయాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆదేశించారు. పద్మావతి అతిథిగృహంలో శనివారం ఆయన అధికారులతో సమీక్షించారు. ముఖ్యంగా గత నెలలో భక్తుల నుంచి సేకరించిన అభిప్రాయాలపై చర్చించారు. కాలిబాట మార్గాల్లో ఎస్టేట్, హెల్త్ విభాగాలు తరచూ తనిఖీలు నిర్వహించాలని, దుకాణాల్లో వస్తువుల ధరలను పర్యవేక్షించాలన్నారు. అన్నప్రసాద భవనంలో చేతులకు తొడుగులు ధరించి ప్రసాదాలు వడ్డించాలని సిబ్బందికి సూచించారు. లగేజీ కౌంటర్ వద్ద భక్తులకు సకాలంలో లగేజీ అందేలా సిబ్బంది పనితీరును పర్యవేక్షించాలన్నారు. ఏటీసీ నుంచి అక్టోపస్ సర్కిల్ వరకు క్యూలైన్లలో అన్నప్రసాదం, తాగునీరు అందేలా చూడాలన్నారు. భక్తుల అభిప్రాయాలను పరిగణంలోకి తీసుకుని వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. కాగా గోపార్క్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ప్రతినిధి పార్కింగ్ సమస్యల పరిష్కారంపై పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు సమావేశంలో డిప్యూటీఈవోలు లోకనాథం, రాజేంద్ర, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

19న స్వర్ణముఖి నదీ హారతులు

శ్రీకాళహస్తి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయ ఆధ్వర్యంలో నెల 19వ తేదీ బుధవారం స్వర్ణముఖి నదీ హారతులు నిర్వహించనున్నట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. అష్టోత్తర శత కలశాభిషేకం, బిల్వ నిమజ్జనం, స్వర్ణముఖి నదీ హారతులు జరుగుతాయన్నారు. ఈ నేపథ్యంలో రాహుకేతు పూజలు మినహా మిగిలిన అన్ని ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు తెలిపారు.



గోదాములో 'ఎర్ర బంగారం'

- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వ్యాఖ్య

మంగళం, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): గోదాములో ఉండేది 2.6 లక్షల ఎర్రచందనం దుంగలు. వీటి విలువ దాదాపు రూ.పది వేల కోట్లు. ఈ గణాంకాలు తెలిసి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆశ్చర్యపోయారు. గోదాములో 'ఎర్ర బంగారం' నిల్వ చేసినట్లుంది అంటూ వ్యాఖ్యానించారు. శనివారం ఆయన తిరుపతి నగరం తిమ్మినాయుడుపాళెం వద్ద గల ఎర్రచందనం కేంద్ర గోదామును పరిశీలించారు. ఈ దుంగలు ఎంత పటిష్ఠంగా ఉంటాయో తెలుసుకోవడానికి సుత్తి తీసుకుని కొట్టి పరీక్షించారు. ఏ, బీ, సీ, నాన్ గ్రేడ్‌గా వర్గీకరించిన దుంగలు, బై ప్రొడక్ట్స్‌ను పరిశీలించారు. ఒక చెట్టును రెండునుంచి మూడు దుంగలుగా స్మగ్లర్లు నరుకుతారని అధికారులు తెలిపారు. ఈ లెక్కన శేషాచల కొండల్లో తెలిసి రెండు లక్షల చెట్లను నరికేస్తే.. తెలియకుండా ఇంకెంత నరికేశారోనని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడున్న దుంగలను ఎత్తుకుని వాటి బరువు పరిశీలించారు. గ్లోబెల్ టెండర్లు నిర్వహిస్తున్న సమయంలో చూపించేది ఒకటి.. వారికి ఇస్తున్నది మరొకటన్న అపవాదు ఉందని అడగ్గా.. అందుకు అవకాశంలేదని అటవీశాఖ అధికారులు సమాధానమిచ్చారు. దుంగలు పట్టుబడగానే గ్రేడ్లుగా విభజించి నంబరింగ్ చేస్తామని, వాటిని మార్చడం జరగదన్నారు. కొనుగోలుదారులు ఎంపిక చేసుకున్న వాటినే ఇవ్వాలని పవన్ స్పష్టంచేశారు. బైప్రోడక్ట్ తీసుకున్నవారు ఎందుకువినియోగిస్తారు వీటితో ఏం చేస్తారని ఆసక్తిగా తెలుసుకున్నారు. ప్రస్తుతం గోదాములో 5,300 టన్నుల ఎర్రచందనానికి ఏడాదికి దాదాపు పదివేలకోట్లకు గాను రూ.1.28కోట్లు బీమా చేసినట్లు అధికారులు చెప్పారు. దాదాపు 45నిమిషాల పాటు ఎనిమిది గోదాములను చూశారు. ఈ కార్యక్రమంలో పీసీసీఎఫ్ చలపతిరావు, ప్రభుత్వ అటవీశాఖ సలహాదారు మల్లికార్జునరావు, ఓఎస్డీ శివరాంప్రసాద్, సీసీఎఫ్ సెల్వం, తిరుపతి జిల్లా అటవీశాఖ అధికారి సాయిబాబా, సెంట్రల్ గోదాము డీఎఫ్‌వో రవిశంకర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

మామండూరులో పవన్

- అరుదైన మొక్క నాటిన డిప్యూటీ సీఎం

తిరుపతి, నవంబరు8(ఆంధ్రజ్యోతి): రేణిగుంట మండలం మామండూరు అటవీ ప్రాంతాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శనివారం సందర్శించారు. అడవిలో నాలుగు కిలోమీటర్లపైగా ప్రయాణించారు. ఇందులో రెండు కిలోమీటర్ల మేర నడుస్తూ ప్రతి చెట్టునూ పరిశీలించారు. ఎర్రచందనం, అంకుడు, తెల్లమద్ది, వెదురుతో పాటు శేషాచలంలో మాత్రమే కనబడే అరుదైన మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వాచ్ టవర్ నుంచి అటవీ ప్రాంతాన్ని పరిశీలించారు. వెలిగొండ, శేషాచలం అటవీ సరిహద్దుల గురించి అడిగి తెలుసుకున్నారు. స్వర్ణముఖీ నది ఎక్కడి నుంచి ఉద్భవిస్తుందనే వివరాలూ అడిగారు. మామండూరు రిజర్వ్ ఫారెస్ట్ ప్రధాన వేదిక సమీపంలో జీవవైవిధ్యం కలిగిన 61 మొక్కలను ఏర్పాటుచేశారు. ఇందులో అండమాన్ నుంచి తెప్పించిన అండమాన్ సైకస్, సైకస్ స్ఫేరికా (జామంతి చెట్టు)మొక్కలను నాటి నీరు పోశారు. గాలిబుడగ, చింతచిల్లి, తూరిపూవు ఎర్రగించ గడ్డి, ఆఫ్రికా మహాగని, సముద్ర జడి, సింధూర చెట్టు, గుగ్గిలం, గురివింద వంటి మొక్కలను అక్కడ అధికారులు నాటారు. బయోడైవర్సిటీ హాట్‌స్పాట్‌గా పిలిచే దీనిని మియావాకి ఫారెస్టుగా మారుతుందని అధికారులు చెప్పారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ రాయుడు, టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్, ఇతర అటవీ అధికారులు ఉన్నారు. మామండూరుకు పవన్ వస్తున్నారని తెలిసి జనసేన శ్రేణులతో పాటు స్థానిక కూటమి నాయకులు అక్కడకు చేరుకున్నారు. అయితే అధికారులు రిజర్వ్ ఫారెస్ట్ ప్రధాన గేటు లోపలకు మాత్రమే కొందరు నాయకులకు అనుమతించి.. లోపలికి వెళ్లకూడదని ఆంక్షలు పెట్టారు. దీంతో నాయకులు కొంతసేపు వేచివుండి పవన్ రాక ముందే తిరిగి వెళ్లిపోయారు. అభిమానులనూ పోలీసులు అనుమతించలేదు.

'ఎర్ర' స్మగ్లింగ్‌ను అరికట్టడమే లక్ష్యం

- స్మగ్లర్లపై పీడీ యాక్ట్ అమలు... థర్మల్ డ్రోన్ల ద్వారా నిఘా
- అధికార యంత్రాంగానికి డిప్యూటీ సీఎం ఆదేశం

తిరుపతి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టడమే లక్ష్యంగా పనిచేయాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. శనివారం సాయంత్రం తిరుపతి కలెక్టరేట్‌లో రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల కలెక్టర్లు, అటవీ, పోలీసు, టాస్క్‌ఫోర్స్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఎర్రచందనం అక్రమ రవాణాను అరికట్టేందుకు అడిషనల్ జాయింట్ పెట్రోలింగ్ క్యాంపులు, చెక్‌పోస్టులు, సీసీ టీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. స్మగ్లర్లపై పీడీ యాక్ట్ అమలు చేయాలన్నారు. ఇకపై అక్రమ రవాణా చేయాలంటే భయపడేలా చర్యలుండాలని స్పష్టం చేశారు. అటవీ శాఖలో ఖాళీ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. శేషాచల అడవుల నుంచి కూలీలు, మేస్త్రీలు, లాజిస్టిక్స్ సపోర్టర్లు, ట్రాన్స్‌పోర్టర్లు, గోడౌన్ కీపర్లు, ఎక్స్‌పోర్టుల ద్వారా ఎర్రచందనం అంతర్జాతీయ స్మగ్లర్లకు చేరుతోందని అధికారులు వివరించారు. 2004 నుంచి ఇప్పటి వరకు 14,204 టన్నుల ఎర్రచందనం దుంగలు, 10,450 వాహనాలను స్వాధీనం చేసుకున్నామని అటవీ, పోలీసు అధికారులు వివరించారు. 16,985 కేసులు నమోదుచేసి 32,345 మందిని అరెస్టు చేశామని వెల్లడించారు. ఈ సమావేశంలో అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డాక్టర్ పి.వి.చలపతిరావు, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, తిరుపతి కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సెల్వం, అనంతపురం, కర్నూలు కన్సర్వేటర్లు యశోదాబాయి, కృష్ణమూర్తి, చిత్తూరు ఎస్పీ తుషార్ డూడీ, అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్, కడప ఎస్పీ విశ్వనాథ్, తిరుపతి, ప్రకాశం, నెల్లూరు, కడప, అన్నమయ్య జిల్లాల డీఎఫ్‌వోలు పాల్గొన్నారు.





ఒకే వేదికపై తండ్రీ కొడుకులు

ఒకరు డిప్యూటీ సీఎం పవన్ వ్యక్తిగత కార్యదర్శి స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ జి.ఆర్.మధుసూదన్. మరొకరు తిరుపతి అర్బన్ తహసీల్దారు రామచంద్ర. వీరిద్దరూ తండ్రీ కొడుకులు. శనివారం పవన్ పర్యటనలో.. విధి నిర్వహణలో భాగంగా కలెక్టరేట్‌లో తండ్రి జి.రామచంద్ర.. కుమారుడు మధుసూదన్ ఒకే వేదికపైకి చేరారు. వీరిద్దరితో పవన్‌కల్యాణ్ ఫొటోదిగి అభినందించారు.

- తిరుపతి అర్బన్, ఆంధ్రజ్యోతి

భక్త కనకదాసుకు నివాళి

తిరుపతి (కలెక్టరేట్), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): భక్తకనకదాసు 538 జయంత్యుత్సవాలు శనివారం కలెక్టరేట్‌లో జరిగాయి. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కనకదాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కవి, గాయకుడు, రచయిత, సంఘసంస్కర్తగా సమాజంలో నెలకొన్న అనేక దురాచారాలను దూరంచేయడానికి కృషి చేశారని గుర్తుచేసుకున్నారు. కలెక్టర్ వెంకటేశ్వర్, డీఆర్వో నరసింహులు, బీసీ సంక్షేమశాఖ అధికారి భరత్‌కుమార్‌రెడ్డి, జ్యోత్స్న, జిల్లా కురబసంఘం నాయకులు పాల్గొన్నారు.



తప్పిపోయిన వృద్ధుడి అప్పగింత

తిరుపతి(నేర విభాగం), నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): తప్పి పోయిన వృద్ధుడిని శనివారం తిరుపతి కమాండ్ కంట్రోల్ సెంటర్ సిబ్బంది సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. శ్రీవారి దర్శనార్థం మన్యం జిల్లా పర్వతీపురానికి చెందిన నల్ల గంగునాయుడు(72) డిసెంబరు 28న కుటుంబ సభ్యులతో కలిసి వచ్చారు. తిరుపతిలోని విష్ణు నివాసం వద్ద తప్పిపోయారు. కుటుంబ సభ్యులు వెంటనే కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సంప్రదించగా, సిబ్బంది సీసీటీవీ దృశ్యాలు పరిశీలించారు. ఆయన విష్ణు నివాసం నుంచి బయటకు వెళ్ళినట్లు గుర్తించారు. ఆయన ఫొటో, వివరాలను కమాండ్ కంట్రోల్ సిబ్బంది వాట్సాప్, సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేశారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో సెక్యూరిటీ దేవేంద్ర కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు కాల్ చేసి, ఆ వృద్ధుడు ఆఫీస్ సమీపంలో తిరుగుతున్నట్లు సమాచారమిచ్చారు. ఈ విషయాన్ని ఆయన కుమారుడు నల్ల శివకు తెలియజేయగా, వెంటనే కంట్రోల్ రూమ్ చేరుకొని తమ తండ్రిని తీసుకెళ్లారు. పోలీసు సిబ్బందిని ఎస్పీ సుబ్బరాయుడు అభినందించారు.

వర్షం నుంచి రక్షణగా..

అలిపిరి కాలిబాటలో ఫైబర్ షీట్లతో పైకప్పు ఏర్పాటు

తిరుమల, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): కాలినడకన తిరుమలకు వచ్చే భక్తులకు వర్షం నుంచి ఉపశమనం కల్పించేలా ఫైబర్ షీట్లతో టీటీడీ పైకప్పు ఏర్పాటు చేసింది. సాధారణంగా మొక్కులున్న భక్తులు శ్రీవారిమెట్టు మార్గానికంటే అలిపిరి కాలినడక మార్గాన్నే అధికంగా వినియోగిస్తారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయం (ఎన్ఎస్ టెంపుల్) నుంచి మోకాళ్లమెట్టు వరకు రోడ్డు వెంబడే ఉన్న నడకమార్గంలో కొంతభాగం పైకప్పు లేదు. దీంతో ఎండ, వర్షం సమయాల్లో భక్తులు ఇబ్బంది పడాల్సిన పరిస్థితులు ఎదురవుతున్నాయి. గత వేసవిలో ఎండ నుంచి ఉపశమనం కల్పించేలా పైభాగంలో తాత్కాలికంగా రేకులు వేసి పచ్చటి వస్త్రంతో పైకప్పును ఏర్పాటు చేశారు. ఇటీవల భారీ వర్షాలకు తాత్కాలిక పైకప్పు లీకవడంతో భక్తులు తడిచిముద్దయ్యారు. ఈ క్రమంలో తొలిసారిగా దాదాపు కిలోమీటరున్నర దూరం పాటు తెల్లటి ఫైబర్ షీట్లతో పైకప్పును ఏర్పాటు చేశారు.



ఇమామ్ జీవితం ఆదర్శప్రాయం

- ఇమామ్ గ్రంథావిష్కరణ కార్యక్రమంలో సజ్జల

తిరుపతి(జీవకోన), నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఇమామ్ జీవితం ఆదర్శప్రాయమని, మానవత్వం మరచిపోతున్న ఈ రోజుల్లో ఇలాంటి వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలని వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం తిరుపతిలోని మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి నివాసం దగ్గర ఇమామ్ గ్రంథావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా వచ్చిన సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రాజకీయ నాయకుల బాధ్యత, కర్తవ్యాన్ని గుర్తు చేస్తున్న వ్యక్తుల్లో ఇమామ్ అరుదైన వారని అన్నారు. వైసీపీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి మాట్లాడుతూ 53 ఏళ్లుగా ఇమామ్ తెలుసునని, తనతో పాటు జైలు జీవితం కూడా గడిపారని గుర్తు చేసుకున్నారు. సభాధ్యక్షుడు భూమన్ మాట్లాడుతూ రాయలసీమ ఉద్యమంలో ఇమామ్ కీలకపాత్ర పోషించారన్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ ఇమామ్ లాంటి వ్యక్తులు వైసీపీకి అండగా నిలవాలని ఆకాంక్షించారు. మాజీ మంత్రి ఆర్‌కే రోజా మాట్లాడుతూ ఇమామ్ అంటే మత గురువు అని, మొదట మిత్రుడిగా పరిచయమై తర్వాత గురువవుతారని అన్నారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ ఇమామ్ గొప్పతనాన్ని అందరికీ చాటాలన్నారు. అనంతరం ఇమామ్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం, మేయర్ డాక్టర్ శిరీష పాల్గొన్నారు.



ఇమామ్ ప్రస్థానం గ్రంథావిష్కరణ చేస్తున్న సజ్జల రామకృష్ణారెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, భూమన కరుణాకరరెడ్డి, అంబటి రాంబాబు, ఆర్‌కే రోజా, నారాయణస్వామి, ఇమామ్ తదితరులు